

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | గురువారం 14-11-2024 | సంపుటి - 21 | సంచిక -207 | రూ : 4 | పేజీలు: 8


# నోటీసులు ఇవ్వకుండా ఆస్తులు కూల్చొద్దు

- అప్పీల్, జవాబు చెప్పకునే అవకాశం ఇవ్వాలి
- అధికారులు జడ్జీల్లా మారి శిక్షలు వేయొద్దు
- అక్రమంగా కూలిస్తే జీతం నుంచి పరిహారం
- ఆస్తుల కూల్చివేతలపై సుప్రీంకోర్టు కీలక తీర్పు
- కూల్చివేతలపై రాష్ట్రాలకు మార్గదర్శకాలు జారీ

న్యూఢిల్లీ, నవంబర్ 13: బుల్డోజర్ న్యాయానికి సుప్రీంకోర్టు బ్రేకులు వేసింది. ఆరోపణలు ఎదుర్కొంటున్నారనే కారణంతో అధికారులే న్యాయమూర్తులుగా మారి ఇండ్లు కూల్చేయడం లాంటి శిక్ష విధించడం పూర్తిగా రాజ్యాంగ విరుద్ధమని ఆక్షేపించింది. బుల్డోజర్‌తో ఇంటిని కూల్చేసి మహిళలు, చిన్నారులు, వృద్ధులను రాత్రికి రాత్రి నిరాశ్రయులు చేసే దృశ్యం భయంకరమైనదని అభివర్ణించింది. ముందస్తు నోటీసులు ఇవ్వకుండా ఆస్తులు కూల్చడానికి వీలు లేదని స్పష్టం చేసింది. కూల్చివేతలపై అనుసరించాల్సిన ప్రక్రియపై రాజ్యాంగంలోని ఆర్టికల్ 142 కింద అధికారాలను వినియోగించి

తరువాయి 2లో





## దిల్లీని కమ్మేసిన పొగమంచు

- పలు విమానాల దారి మళ్లింపు
- ఎర్రకోట వద్ద కమ్మేసిన పొగమంచు

దిల్లీ: దేశరాజధాని దిల్లీని బుధవారం అత్యంత దట్టమైన పొగమంచు కమ్మేసింది. దీంతో సమీపంలోని దృశ్యాలు కూడా కనిపించని (జీరో విజిబిలిటీ) పరిస్థితి నెలకొంది. ఇందిరా గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో రన్‌వేపై 125 మీటర్ల దూరం వరకే కనిపిస్తున్న కారణంగా

తరువాయి 2లో

## భారత్‌కు 'శ్వేత హంసలు'



2లో

## ముంబైలో రేవంత్ రోడ్‌షో

- ఆదిత్య ఠాక్రేకు మద్దతుగా ప్రచారం
- ఘనస్వాగతం పలికిన మహారాష్ట్ర ప్రజలు

హైదరాబాద్, నవంబరు 13 : శివసేన (యూబీటీ) అభ్యర్థి ఆదిత్య ఠాక్రేకు మద్దతుగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బుధవారం ముంబైలోని వర్లీలో రోడ్‌షో నిర్వహించారు. మహారాష్ట్ర శాసనసభ ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ స్టార్ క్యాంపెయినర్‌గా పాల్గొంటున్న రేవంత్‌కు దారి

తరువాయి 2లో



## తెలంగాణ, ఏపీలో రెండు రోజులు వర్షాలు

- తేలికపాటి జల్లుల నుంచి మోస్తరు వర్షాలకు అవకాశం
- హైదరాబాద్, అమరావతి వాతావరణ కేంద్రాల వెల్లడి



2లో

# మహాయుతికి ఉల్లిమంట

- మహారాష్ట్రలో పెరుగుతున్న ఉల్లి ధరలు
- ముంబైలో కిలో రూ.100
- బఫర్ నిల్వలను విడుదల చేసి సరఫరా చేస్తున్నా తగ్గని ధరలు
- ఉల్లి ఎగుమతులపై నిషేధంతో మహా రైతుల నుంచి వ్యతిరేకత

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా పెరుగుతున్న ఉల్లి ధరలు సామాన్యులకు కంటతడి పెట్టిస్తుంటే మరోపక్క ప్రస్తుత మహారాష్ట్ర ఎన్నికల్లో మహాయుతిలో భాగమైన అధికార పార్టీ నేతలకు మంట పుట్టిస్తోంది. ఓ పక్క పెరుగుతున్న ధరలతో సామాన్యులు అధికార కూటమి ప్రభుత్వంపై నిప్పులు గక్కుతున్నారు. ఎగుమతులపై నిషేధంతో తమకు గిట్టుబాటు తగ్గిందని రైతులు సైతం గగ్గోలు పెడుతుండటం మహాయుతి కూటమికి సంకటంగా మారింది. దేశీయ అవసరాలకు అవసరమైన ఉల్లిలో 40 శాతం మహారాష్ట్ర నుంచే

తరువాయి 2లో



## తప్పుడు ప్రకటనలు ఇస్తే మూతే..

- కోచింగ్ సెంటర్లకు కేంద్రం మార్గదర్శకాలు
- అనుమతి లేనిదే అభ్యర్థుల ఫొటోలు వాడొద్దు
- తప్పుదోవ పట్టించే ప్రకటనలకు అడ్డుకట్ట



న్యూఢిల్లీ: పోటీ పరీక్షలకు శిక్షణనిచ్చే కోచింగ్ సెంటర్లు తప్పుడు ప్రకటనలు ఇవ్వకుండా నియంత్రించేందుకు సెంట్రల్ కన్జూమర్ ప్రొటెక్షన్ అథారిటీ (సీసీపీఏ) కొత్త మార్గదర్శకాలను జారీ చేసింది. పలు కోచింగ్ సెంటర్లు తప్పుడు ప్రకటనలపై నేషనల్ కన్జూమర్ హెల్ప్‌లైన్‌కు పెద్ద

తరువాయి 2లో

## జంగిల్‌రాజ్ నుంచి బిహార్‌ను కాపాడారు



- ముఖ్యమంత్రి నీతీశ్‌పై మోదీ ప్రశంసల జల్లుదర్భంగాలో ఎయిమ్స్‌కు ప్రధాని శంకుస్థాపన


దర్భంగా (బిహార్): ఆటవిక రాజ్యం (జంగిల్‌రాజ్) నుంచి బిహార్‌కు విముక్తి కల్పించిన నీతీశ్ బాబును ఎంతగా ప్రశంసించినా తక్కువేనని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. బుధవారం ఉత్తర బిహార్‌లోని దర్భంగాలో ఎయిమ్స్ (ఆలిండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్) ఆసుపత్రి నిర్మాణానికి శంకుస్థాపన చేసిన ప్రధాని రూ.12,000 కోట్ల ఇతర ప్రాజెక్టులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన

తరువాయి 2లో

## నెరవేరుతున్న కేసీఆర్ సంకల్పం..

- రేపు యాదగిరిగుట్టలో స్వర్ణ తాపడం పనులకు శ్రీకారం
- విమాన గోపురానికి పసిడి రేకుల అమరిక
- 60 కేజీలతో తిరుపతి తరహాలో స్వర్ణకవచం !
- నాడు కేసీఆర్ నిశ్చయం.. కేజీ 16 తులాల బంగారు విరాళం
- భక్తుల చందాలతో దేవస్థానం కార్యాచరణ


2లో



## శబరిమలలో చాట్‌బాట్

- యాత్రికుల కోసం 'స్వామి' పేరుతో ఏర్పాటు.. మూడు చోట్ల వాతావరణ కేంద్రాలు
- దర్శనం వేళలు 18 గంటలకు పెంపు

2లో



# నోటీసులు ఇవ్వకుండా ఆస్తులు కూల్చొద్దు

(మొదటిపేజీ తరువాయి)

రాష్ట్రాలకు సుప్రీంకోర్టు మార్గదర్శకాలను జారీ చేసింది. పలు రాష్ట్రాల్లో అవలంబిస్తున్న బుల్డోజర్ న్యాయాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై జస్టిస్ బీఆర్ గవాయి, జస్టిస్ కేవీ విశ్వనాథన్ ధర్మాసనం బుధవారం 95 పేజీల కీలక తీర్పు వెలువరించింది.

* **అధికారులే న్యాయమూర్తులుగా మారొద్దు**

పలు కేసుల్లో ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తుల ఇండ్లను అధికారులు కూల్చేయడంపై ధర్మాసనం తీవ్రంగా స్పందించింది. 'అధికారే న్యాయమూర్తులుగా మారి ఓ వ్యక్తిని దోషిగా నిర్ణయించి, అతడి ఆస్తులను కూల్చడం ద్వారా శిక్ష విధించడం కుదరదు. ఇలా చేయడం అధికారి తన పరిమితులను దాటడంతో పాటు అధికారాల విభజన సూత్రాన్ని ఉల్లంఘించడమే అవుతుంది' అని స్పష్టం చేసింది. న్యాయవ్యవస్థ దాని ప్రధాన విధులు నిర్వర్తించకుండా కార్యనిర్వాహక వ్యవస్థ భర్తీ చేయలేదని వ్యాఖ్యానించింది. సహజ న్యాయానికి సంబంధించి కనీస సూత్రాలు పాటించకుండా, సరైన ప్రక్రియను అవలంబించకుండా నిర్మాణాన్ని కూల్చేయడం చట్టవిరుద్ధమని పేర్కొన్నది. అధికారం ఉంది కదా అనే భావనతో ఇష్టారీతిన వ్యవహరించే తీరును ఇది గుర్తు చేస్తున్నదని వ్యాఖ్యానించింది. రాజ్యాంగంలో ఇలాంటి ఏకపక్ష, అతిగా అధికారాన్ని ఉపయోగించే చర్యలకు చోటు లేదని స్పష్టం చేసింది.

* **ఇల్లు కూల్చడమంటే కుటుంబం మొత్తాన్ని శిక్షించడమే**

ఒక వ్యక్తి ఏదైనా కేసులో నిందితుడిగా లేదా దోషిగా ఉన్నందుకు ఆ వ్యక్తి నివసించే ఇంటిని కూల్చేయడం అంటే ఆ ఇంట్లో నివసించే మొత్తం కుటుంబానికి శిక్ష విధించడమే అని కోర్టు పేర్కొన్నది. ఇది అరాచకమని, రాజ్యాంగం కల్పించిన జీవించే హక్కును ఉల్లంఘించడమే అని స్పష్టం చేసింది. ఇల్లు ఉండటం ఏ వ్యక్తికైనా సంతృప్తిని ఇస్తుందని, గౌరవాన్ని, నాది అనే భావనను కలిగిస్తుందని, భవిష్యత్తు, భద్రతపై ఆశను కల్పిస్తుందని జస్టిస్ గవాయి అన్నారు. సగటు పౌరుడికి ఇంటి నిర్మాణం అనేది ఏండ్ల తరబడి పడ్డ శ్రమ, కల, ఆకాంక్షలకు పరాకాష్ట అని, దానిని తొలగించాలంటే అధికారులు కచ్చితంగా వేరే మార్గం లేదని సంతృప్తి చెందాలని వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా ప్రముఖ హిందీ కవి ప్రదీప్ రాసిన కవిత్వాన్ని ప్రస్తావించారు.

* **బుల్డోజర్ ఇక ఎప్పటికీ గ్యారేజ్‌లోనే: అఖిలేశ్ యాదవ్**

బుల్డోజర్ న్యాయంపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్ హర్షం వ్యక్తం చేశారు. 'సుప్రీంకోర్టు పెద్ద ఆదేశాన్ని ఇచ్చింది. ఇది బుల్డోజర్ చర్యలను నిలిపేస్తుంది. బుల్డోజర్‌ను సుప్రీంకోర్టు ఎప్పటికీ గ్యారేజ్‌లోనే ఉండేలా పార్క్ చేసేసింది' అని ఆయన వ్యాఖ్యానించారు. బుల్డోజర్ యాక్షన్ పేరుతో రాష్ట్రంలో పేదల ఇండ్లను కూల్చేశారని, అయోధ్యలో బీజేపీ ఓటమికి కూడా ఇదే కారణమని పేర్కొన్నారు.

* **కూల్చివేతలపై సుప్రీంకోర్టు మార్గదర్శకాలు**

ముందస్తు షోకాజ్ నోటీసు లేకుండా నిర్మాణాన్ని కూల్చేయొద్దు. యాజమాని లేదా ఆక్రమణదారుడికి రిజిస్టర్ పోస్టు ద్వారా నోటీసు ఇవ్వడంతో పాటు నిర్మాణం బయట అంటించాలి.

నోటీసు అందుకున్న వ్యక్తి సమాధానం చెప్పేందుకు స్థానిక మున్సిపల్ చట్టాలు సూచించిన సమయం లేదా 15 రోజుల గడువులో ఏది ఎక్కువ అయితే అది ఇవ్వాలి.

సదరు నిర్మాణం ఏ రకంగా నిబంధనలకు విరుద్ధమో నిర్దిష్ట కారణాన్ని నోటీసులో పేర్కొనాలి. నోటీసుకు జవాబుగా ఏయే డాక్యుమెంట్లను అందించాలి, వ్యక్తిగత విచారణకు ఏ అధికారి ముందు, ఎప్పుడు హాజరు కావాలో స్పష్టంగా తెలియజేయాలి.

నోటీసులో గత తేదీని వేశారనే ఆరోపణలు రాకుండా, నోటీసు ఇచ్చిన విషయాన్ని ఈమెయిల్ ద్వారా జిల్లా కలెక్టర్ కార్యాలయానికి తెలియజేయాలి. దీనిని ధ్రువీకరిస్తూ కలెక్టర్ కార్యాలయం నుంచి ఆటోజనరేటెడ్ రిప్లై వెళ్లాలి.

నోటీసు అందుకున్న వ్యక్తి స్పందనను వ్యక్తిగతంగా వినే అవకాశం ఇచ్చిన తర్వాతనే అధికారులు తుది ఉత్తర్వులు ఇవ్వాలి.

నోటీసు అందుకున్న వ్యక్తి ఇచ్చిన జవాబు ఏంటి? దానిని ఏ కారణంతో తిరస్కరిస్తున్నారో తుది ఉత్తర్వుల్లో అధికారి పేర్కొనాలి.

నోటీసు గడువు ముగిసినా స్టే లభించనప్పుడు, కూల్చివేయాలని తుది ఉత్తర్వులు ఇచ్చిన తర్వాత యజమాని లేదా ఆక్రమణదారుడు తన అనధికార నిర్మాణాన్ని సొంతంగా తొలగించేందుకు, కూల్చేసేందుకు 15 రోజుల గడువు ఇవ్వాలి.

కూల్చివేత ప్రక్రియను వీడియో తీసి భద్రపర్చాలి.

ఈ ఉత్తర్వులను ఉల్లంఘించి కూల్చివేత జరిపితే సంబంధిత అధికారులు బాధ్యత వహించాలి. నష్టపరిహారం చెల్లించడంతో పాటు సొంత ఖర్చుతో ఆస్తిని పునరుద్ధరించాలి.

ప్రతి మున్సిపాలిటీ, స్థానిక సంస్థ మూడు నెలల్లోగా ఒక ప్రత్యేక డిజిటల్ పోర్టల్‌ను ఏర్పాటు చేయాలి. ఇందులో నోటీసులు ఇవ్వడం, జవాబు, షోకాజ్ నోటీసు, ఆర్డర్ వంటి వివరాలను అందుబాటులో ఉంచాలి.

అన్ని రాష్ట్రాలు ఈ ఆదేశాల గురించి తెలియజేస్తూ జిల్లా మెజిస్ట్రేట్లు, స్థానిక అధికార వ్యవస్థలకు సర్కులర్లు జారీ చేయాలి.

నెలలోగా కలెక్టర్లు ప్రత్యేక నోడల్ అధికారులను నియమించి మున్సిపాలిటీలకు తెలియజేయాలి.

రోడ్డు, ఫుట్‌పాత్, రైల్వే లైన్, నదులు, నీటి వనరులు వంటి పబ్లిక్ ప్లేస్‌లలో ఉన్నఅక్రమ నిర్మాణాలకు, కూల్చివేయాలని కోర్టు ఉత్తర్వులు ఉన్న వాటికి ఈ మార్గదర్శకాలు వర్తించవు.

# మహాయుతికి ఉల్లిమంట

(మొదటిపేజీ తరువాయి)

సరఫరా అవుతుండగా, ప్రస్తుత సీజన్‌లో భారీ వర్షాల కారణంగా ఉల్లి దిగుబడి గణనీయంగా తగ్గింది. దీంతో మహారాష్ట్రలోని నాసిక్, లాసల్‌గావ్ మార్కెట్లకు తరలివస్తున్న ఉల్లి సరకు పరిమాణం బాగా తగ్గిపోయింది. గత సంవత్సరం ఉల్లిసీజన్‌లో ప్రతి రోజూ దాదాపు 2,000 టన్నుల ఉల్లి మార్కెట్‌వ వచ్చింది. అది ప్రస్తుతం 300400 టన్నుల మధ్య తచ్చాడుతోంది.

దీనికి తోడు గత రబీలో సేకరించి పెట్టిన ఉల్లి నిల్వలు పూర్తిగా అడుగంటడం ధరల పెరుగుదలకు కారణమయ్యాయి. దీంతో గత నెల రోజుల వ్యవధిలోనే ఉల్లి ధర కిలో రూ.4050 నుంచి రూ.90100కి ఎగబాకింది. దీని ప్రభావం మహారాష్ట్ర ఎన్నికలపై నేరుగా పడుతుందని ముందే పసిగట్టిన బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ధరల కట్టడికి రంగంలోకి దిగింది. ధర మరీ పెరిగిపోకుండా కట్టడిచేసేందుకు 4.7లక్షల టన్నుల బఫర్ నిల్వలోంచి 1.50లక్షల టన్నుల మేర విడుదలచేసింది.

దీంతో నాసిక్ నుంచి మహారాష్ట్రలోని వివిధ ప్రాంతాల్లోని విక్రయ కేంద్రాల్లోకి ఉల్లి సరఫరా సాధ్యమైంది. వీటిల్లో కిలో ఉల్లిని రూ.35కే విక్రయిస్తున్నారు. అయినాసరే ధరల పెరుగుదల ఆగడం లేదు. 'గత రబీ సీజన్‌లోని పాత స్టాక్ దాదాపు అయిపోయింది. కొత్త స్టాక్ ఇంకా మార్కెట్లోకి రాలేదు. ఈ సరఫరాడిమాండ్ అసమతుల్యత ధర పెరుగుదలకు కారణం. దీన్ని చక్కదిద్దే ప్రయత్నాలు జరుగుతున్నాయి' అని మహారాష్ట్ర ప్రభుత్వం వివరణ ఇచ్చింది. ధరల ఉరవడిపై మహా వికాస్ అఘాడీ కూటమిలోని కాంగ్రెస్, శివసేన (యూబీటీ) పార్టీలు షిండే సర్కార్‌పై విమర్శలు ఎక్కుపెడుతున్నాయి.

ఎగుమతుల నిషేధంపై రైతుల్లో ఆగ్రహం

ఉల్లి ఎగుమతులపై నిషేధం విధిస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం రైతుల ఆగ్రహానికి కారణమవుతోంది. గడిచిన లోక్‌సభ ఎన్నికల సమయంలో డిసెంబర్ 2023 వరకు ఉన్న ఎగుమతులపై నిషేధాన్ని కేంద్రప్రభుత్వం 2024 మార్చినెల వరకు పొడిగించింది. దీనికి తోడు ఎగమతి సుంకాలను 25 శాతం నుంచి 40 శాతానికి పెంచింది. ఎగుమతి ఆంక్షలు తమ జీవనోపాధిని దెబ్బతీశాయని మహారాష్ట్ర రైతుల ఆవేదనవ్యక్తంచేస్తున్నారు.

ఉల్లి సాగు అధికంగాఉండే ధూలే, దిండోరి, అహ్మద్‌నగర్, పుణె, నాసిక్‌లలో రైతులు తీవ్రంగా నష్టపోయారు. అయితే మహారాష్ట్ర నుంచి ఎగుమతులను నిషేధించిన కేంద్రం తమ పార్టీ ఏలుబడిలో ఉన్న గుజరాత్ నుంచి మాత్రం ఎగుమతులపై ఉన్న నిషేధాన్ని ఎత్తేయాలని నిర్ణయించడంతో మహారాష్ట్ర రైతుల్లో ఆగ్రహం కట్టలు తెంచుకుంది. ఈ కారణంగానే ఇటీవల లోక్‌సభ ఎన్నికల్లో 12 ఎంపీ స్థానాల్లో మహాయుతి కూటమి ఓటమిని చవిచూసిందని విశ్లేషణలు వెలువడ్డాయి.

మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ సైతం లోక్‌సభ ఎన్నికల్లో మహాయుతి పేలవ ప్రదర్శన వెనుక ఉల్లి రైతుల ఆగ్రహం ఉందని అంగీకరించారు. బీజేపీ నేతృత్వంలోని కేంద్రం మహారాష్ట్రలోని ఉల్లి రైతుల కంటే గుజరాత్‌లోని ఉల్లి రైతుల గురించే పట్టించుకుంటోందని కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేష్ ఇటీవల వ్యాఖ్యానించారు. ఈ నేపథ్యంలో ఉల్లి మంట నుంచి బయట పడేందుకు పాలక కూటమి ఎలాంటి దిద్దుబాటు చర్యలు తీసుకుంటుందన్న దానిపైనే ఎన్నికల్లో సామాన్యులు, రైతుల సానుకూల, ప్రతికూల ఓటింగ్ సరళి ఆధారపడిఉంటుందని తెలుస్తోంది.

# నెరవేరుతున్న కేసీఆర్ సంకల్పం..

యాదాద్రి భువనగిరి, నవంబర్ 13: ప్రపంచ అద్భుత ఆధ్యాత్మిక క్షేత్రంగా యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి ఆలయాన్ని తీర్చిదిద్దిన తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ బంగారు కల నెరవేరబోతున్నది. సుందర ఆలయం త్వరలో కొత్త రూపు సంతరించుకోనున్నది. దేవాలయ విమానం గోపురం స్వర్ణమయం కానున్నది. తొలి విడతలో ఈ నెల 15న గోపురానికి బంగారు రేకుల అమరిక పనులకు దేవస్థానం శ్రీకారం చుట్టనున్నది.

**చారిత్రకం.. ఆలయ పునర్నిర్మాణం**

తెలంగాణ తిరుపతిగా పేరుగాంచిన యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి ఆలయాన్ని ఉమ్మడి రాష్ట్రంలో పాలకులు పట్టించుకోలేదు. కానీ స్వరాష్ట్రంలో తొలి సీఎం కేసీఆర్ యావత్ దేశం అబ్బురపడేలా యాదగిరిగుట్టను రూ.1200 కోట్లతో పునర్నిర్మాణం చేశారు. ఆలయ గోపురాలు, మాఢవీధులు, ప్రాకారాలు, గర్భగుడి, ధ్వజస్తంభం, శివాలయం, క్యూలైన్లు, ప్రసాదం వంటశాల, పుషరిణి, యాగశాల నిర్మించారు. కొండపైన విష్ణుపుషరిణి, కొండ దిగువన లక్ష్మీపుషరిణి, స్వామివారి తెప్పోత్సవం కోసం గండిచెరువు, కల్యాణకట్ట, దీక్షాపరుల మంటపం, నిత్యాన్నదాన సత్రం, సత్యనారాయణ స్వామి వ్రతమంటపం, ఆర్టీసీ, దేవస్థానం బస్టాండులు, గుట్ట చుట్టూ రెండు ఫ్లైఓవర్ల నిర్మాణం చేపట్టారు.



**సిరిమెరుపుల వెలుగులు**

ఆలయ పునర్నిర్మాణంలో భాగంగా లక్ష్మీనరసింహ స్వామి ప్రధాన ఆలయ దివ్య విమాన గోపురాన్ని బంగారంతో తాపడం చేయాలని కేసీఆర్ భావించారు. 2022 సెప్టెంబర్ 20న కుటుంబ సమేతంగా దర్శించుకుని కేజీ 16 తులాల బంగారం స్వామివారికి విరాళంగా అందించారు. మొత్తం 127 కేజీల బంగారు తాపడం కోసం రూ.65 కోట్ల వరకు ఖర్చవుతుందని అంచనా వేశారు. ప్రధానాలయ దివ్య విమాన గోపురానికి బంగారు తాపడం కోసం విరాళాలు ఇవ్వాలని గతంలోనే కేసీఆర్ పిలుపునిచ్చారు. ఇప్పటికే చాలా మంది ప్రముఖులు, భక్తులు స్వామివారికి పసిడిని సమర్పించారు.

**ధర్మదాతలు.. దండిగా విరాళాలు**

తిరుమల తిరుపతి దేవస్థానం తరహాలో ఆలయ విమాన గోపురం స్వర్ణమయం కానుంది. ఇందుకు సంబంధించిన డిజైన్‌ను అధికారులు ఖరారు చేశారు. తాపడం పనులకు 60 కేజీల బంగారం అవసరమని అంచనా వేస్తున్నారు. ఇప్పటివరకు దాతల నుంచి విరాళాల ద్వారా 12 కిలోల బంగారం, రూ.21 కోట్ల నగదు చేకూరినట్టు అధికారులు చెబుతున్నారు. అదే విధంగా స్వామివారికి భక్తులు సమర్పించిన 2,300కేజీల వరకు వెండి, ఆలయ బ్యాంకు ఖాతాలో విరాళాలు ఉన్నాయి. వీటితో పాటు భక్తుల నుంచి విరాళాలు ద్వారా మిగతా బంగారాన్ని సమకూర్చనున్నారు. ఇక కానుకలు అందించేందుకు ఆన్‌లైన్ సదుపాయం కూడా ఉందని, భక్తులు సహకరించాలని ఈవో భాసర్‌రావు కోరారు.

**నాటి ఒప్పందం.. నేడు సాకారం**

ప్రభుత్వం గతంలోనే చెన్నైలోని మెసర్స్ స్మార్ట్ క్రియేషన్స్ సంస్థకు స్వర్ణ తాపడం పనులను అప్పగించింది. స్వర్ణ తాపడం కూలి పనులకు అవసరమైన రూ.7 కోట్ల మొత్తాన్ని దేవస్థానం చెల్లించనున్నది. స్వామివారి ప్రధానాలయ విమాన గోపురం 10,500 ఎస్‌ఎఫ్టీల మేరకు ఉంది. ఇప్పటికే రాగి రేకుల పని పూర్తికావడంతో వీటికి బంగారు తాపడం చేపట్టి, విమాన గోపురానికి అమర్చనున్నారు. గోపురం కోసం తయారు చేసిన దేవతల విగ్రహాలతో కూడిన రాగి రేకులను అక్టోబర్‌లో ఆలయ అధికారుల పర్యవేక్షణలో చైన్నెకు తరలించారు. ఇటీవల సుదర్శన చక్రంలో నుంచి చక్ర ఆళ్వార్లను కలశంలోకి ఆహ్వానించే మహా కళావరోహణం నిర్వహించారు. ఈ నెల 15న దివ్య విమాన గోపురానికి స్వర్ణ తాపడం రేకులు అమర్చే ఘట్టానికి శ్రీకారం చుట్టనున్నారు. 2025 ఏడాది ఫిబ్రవరి నాటికి తాపడం అమరిక పనులు పూర్తి చేయనున్నారు. అదే నెల 26న మహా సంప్రోక్షణ చేపట్టే అవకాశం ఉంది.

## దిల్లీని కమ్మేసిన పొగమంచు

(మొదటిపేజీ తరువాయి)

విమానాల రాకపోకలకు ఇబ్బంది ఎదురైంది. దీంతో పది విమానాలను జైపుర్, లఖ్‌నవూ విమానాశ్రయాలకు దారి మళ్లించినట్లు అధికారులు వెల్లడించారు. మరికొన్ని విమానాల ప్రయాణాల్లో జాప్యం చోటుచేసుకున్నట్లు తెలిపారు. మరోవైపు దిల్లీలో వరుసగా 15వ రోజూ వాయు నాణ్యత (ఏక్యూఐ) క్షీణించి 366 పాయింట్లకు చేరుకుంది. హరియాణా, పంజాబ్‌ల్లోనూ ఇదే పరిస్థితి. హరియాణాలోని పానీపత్‌లో ఏక్యూఐ 336కు చేరుకుంది. పంజాబ్‌లోని మండీ గోబింద్‌గఢ్‌లో 308 ఏక్యూఐ నమోదైంది. నానాటికి క్షీణిస్తున్న వాయు నాణ్యతను దృష్టిలో ఉంచుకుని ఐదో తరగతి వరకూ పాఠశాలలను మూసివేయాలని దిల్లీ ప్రభుత్వాన్ని భాజపా డిమాండు చేసింది.

## ముంబైలో రేవంత్ రోడ్‌షో

(మొదటిపేజీ తరువాయి)

పొడవునా ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి అక్కడి ప్రజలు ఘన స్వాగతం పలికారు. రోడ్ షోకు ముందు రేవంత్ ముంబైలోని తిరుపతి బాలాజీ ఆలయంలో పూజలు చేశారు. రోడ్ షోలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు శివసేన (యూబీటీ) అభ్యర్థి ఆదిత్య ఠాక్రే, ముంబై నగర కాంగ్రెస్ అధ్యక్షురాలు వర్ష గైక్వాడ్ పాల్గొన్నారు.

## తెలంగాణ, ఏపీలో రెండు రోజులు వర్షాలు

హైదరాబాద్, నవంబర్ 13 : నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం తీవ్రరూపం దాల్చుతున్నదని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. అల్పపీడనం ఉత్తర తమిళనాడు, దక్షిణ కోస్తాంధ్ర తీరాల వెంట కేంద్రీకృతమై ఉందని వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. అల్పపీడనం ప్రభావంతో తెలంగాణలో తేలికపాటి జల్లుల నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉన్నదని చెప్పారు. రాష్ట్రంలో పగటి పూట వాతావరణం పొడిగా ఉంటున్నదని, సాయంత్రానికి చల్లబడి పలు చోట్ల వర్షాలు కురిసే అవకాశం ఉన్నదని పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని వాతావరణంలో స్వల్ప మార్పులు ఉంటాయని వివరించారు. వర్ష సూచనతో వరి కోతలు, వ్యవసాయ పనుల్లో జాగ్రత్తలు తీసుకోవాలని రైతులకు అధికారులు సూచించారు.

**అమ్మో చలి.. జాగ్రత్త మరి**

తెలంగాణలో రాత్రి ఉష్ణోగ్రతలు పడిపోయి, కొన్ని చోట్ల 15 డిగ్రీ సెల్సియస్ కంటే తక్కువ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. మెదక్, ఆదిలాబాద్ జిల్లాల్లో 14 డిగ్రీలు రికార్డయింది. చలితీవ్రత పెరుగుతున్నందున ప్రజలు జాగ్రత్తలు పాటించాలని వాతావరణశాఖ అధికారులు సూచించారు. కొన్ని ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయని తెలిపారు. రాష్ట్రంలో గరిష్ఠంగా ఖమ్మంలో 34డిగ్రీలు, నిజామాబాద్‌లో 33.4డిగ్రీలు నమోదైంది.

## జంగిల్‌రాజ్ నుంచి బిహార్‌ను కాపాడారు

(మొదటిపేజీ తరువాయి)

సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్, ఆర్జేడీ కూటమి పేరెత్తకుండా బిహార్‌లో కొనసాగిన గత పాలనను విమర్శించారు. నీతీశ్‌కుమార్‌ను 'జనం మెచ్చిన ముఖ్యమంత్రి' అని ప్రశంసల్లో ముంచెత్తారు. ''కాంగ్రెస్ హయాంలో దిల్లీ ఎయిమ్స్ ఒక్కటే పూర్తిస్థాయిలో పనిచేసేది. దేశంలోని మరో నాలుగైదు ఎయిమ్స్‌లలో వైద్య సదుపాయాలు పెద్దగా ఉండేవి కావు. ఈరోజు మేం దేశమంతా రెండు డజన్లకు పైగా ఎయిమ్స్‌లను ఏర్పాటుచేశాం. బలహీనవర్గాలకు 1.5 లక్షల ఆరోగ్య కేంద్రాల ద్వారా వైద్యాన్ని అందుబాటులోకి తెచ్చాం. ఆయుష్మాన్ భారత్‌తో మరో 4 కోట్లమంది లబ్ధి పొందుతున్నారు. స్థానిక భాషల్లో వైద్యవిద్యను అభ్యసించడానికి అనుమతించడం ద్వారా, 75,000 మెడికల్ సీట్ల పెంపుదలకు కృషి చేశాం'' అని ప్రధాని వివరించారు. ఏటా వరదలతో సతమతం అవుతున్న కోసీ మిథిలా ప్రాంత సమస్య పరిష్కారానికి నేపాల్‌తో చర్చలు జరుపుతున్నామని, రూ.11.000 కోట్లతో ప్రణాళిక కూడా సిద్ధంగా ఉందన్నారు. ఇటీవల మృతిచెందిన బిహార్ జానపద గాయని శారదా సిన్హాకు ఈ సందర్భంగా మోదీ నివాళులు అర్పించారు. రాష్ట్ర గవర్నర్ రాజేంద్ర ఆర్లేకర్, కేంద్ర మంత్రులు చిరాగ్ పాస్వాన్, నిత్యానంద్ రాయ్ తదితరులు పాల్గొన్నారు.

**మోదీ పాదాలు మొక్కబోయిన నీతీశ్**

దర్భంగా కార్యక్రమంలో ప్రసంగించిన అనంతరం బిహార్ ముఖ్యమంత్రి నీతీశ్‌కుమార్ (73) ప్రధానమంత్రి నరేంద్ర మోదీ (74) పాదాలకు నమస్కరించేందుకు ప్రయత్నించారు. ప్రధాని ఆయన్ను నిలువరించారు. మోదీ పాదాలకు నమస్కరించేందుకు నీతీశ్ ప్రయత్నించడం ఈ ఏడాదిలో ఇది మూడోసారి.

## తప్పుడు ప్రకటనలు ఇస్తే మూతే..

(మొదటిపేజీ తరువాయి)

ఎత్తున ఫిర్యాదులు అందుతున్న నేపథ్యంలో బుధవారం ఈ మార్గదర్శకాలను ప్రకటించింది. వీటి ప్రకారం ఇక మీద కోచింగ్ సెంటర్లు '100 శాతం జాబ్ గ్యారెంటీ' వంటి ప్రకటనలు ఇవ్వడానికి వీల్లేదు. కోచింగ్ సెంటర్లు ఉద్దేశపూర్వకంగా విద్యార్థుల వద్ద కొంత సమాచారాన్ని దాస్తున్నందున ఈ మార్గదర్శకాలను జారీ చేసినట్టు వినియోగదారుల వ్యవహారాల కార్యదర్శి నిధి ఖారే తెలిపారు. కోచింగ్‌కు సంబంధించి పలు నిర్వచనాలను సైతం మార్గదర్శకాల్లో సీసీపీఏ పొందుపరిచింది. మార్గదర్శకాలను ఉల్లంఘించిన కోచింగ్ సెంటర్లపై కన్జూమర్ ప్రొటెక్షన్ యాక్ట్ - 2019 కింద జరిమానా విధించడం, లైసెన్సులు రద్దు చేయడం, కోచింగ్ సెంటర్లు మూసివేయడం వంటి చర్యలు తీసుకోనున్నారు.

* **కోచింగ్‌కు సంబంధించిన నిర్వచనాలు**

కోచింగ్: విద్యార్థులకు విద్యా సంబంధ మార్గదర్శకత్వం చేయడం, సూచనలు ఇవ్వడం. క్రీడలు, కళలు వంటి విద్యతో సంబంధం లేని అంశాలకు వర్తించదు. కోచింగ్ సెంటర్:50 మంది కంటే ఎక్కువ విద్యార్థులు కలిగి ఉండే సంస్థ.

ఎండార్సర్: కోచింగ్ సెంటర్లకు ప్రచారం చేసే వ్యక్తులు.

* **కోచింగ్ సెంటర్లకు జారీ చేసిన మార్గదర్శకాలు**

కోర్సులు, కాలపరిమితి, అధ్యాపకుల అర్హతలు, ఫీజు, రిఫండ్ విధానాలు, ఫలితాలు, జాబ్ గ్యారెంటీ వంటి అంశాలపై తప్పుదోవ పట్టించే ప్రకటనలు నిషేధం. అధ్యాపకులు, వసతులు, ఇతర వనరులపై కోచింగ్ సెంటర్లు కచ్చితమైన సమాచారాన్ని వెల్లడించాలి. విద్యార్థుల విజయగాథలను వారి అనుమతి లేకుండా వినియోగించుకోవద్దు. విద్యార్థుల పేర్లు, ఫొటో, టెస్టిమోనియల్స్‌ను ప్రకటనల్లో వాడుకునేందుకు విద్యార్థుల నుంచి రాతపూర్వక అనుమతి పొందాలి.

# అంధులలో అక్షర జ్యోతిని వెలిగించిన గొప్ప సంఘ సంస్కర్త వాలంటిన్ హాయ్

* **కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్**

కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి ) : అంధులలో అక్షర జ్యోతిని వెలిగించిన గొప్ప సంఘసంస్కర్త వాలంటిన్ హాయ్ అని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి. వివేకానంద్ అన్నారు. సుభాష్ నగర్ డివిజన్ లూయిస్ బ్రెయిలీ భవనం నందు వెల్ఫేర్ అసోసియేషన్ ఆఫ్ డిజేబుల్డ్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన "వాలెంటిన్ హాయ్" జయంతి వేడుకలకు ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ముఖ్యఅతిథిగా హాజరై "వాలెంటిన్ హాయ్" చిత్రపటానికి జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సమాజంలో అంధుల పట్ల జరుగుతున్న వివక్షతకు చలించి వారి కోసం 1784లో ప్రపంచంలోనే మొట్టమొదటగా అంధ పాఠశాలను ఏర్పాటు చేసిన గొప్ప సంఘ సంస్కర్త "వాలెంటిన్ హాయ్" అని



అన్నారు. ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు నా దృష్టికి తీసుకువస్తూ సమస్యల పరిష్కారానికి "వెల్ఫేర్ అసోసియేషన్ ఆఫ్ డిజేబుల్డ్" సంఘ సభ్యులు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. రానున్న రోజుల్లో కూడా "వెల్ఫేర్ అసోసియేషన్ ఆఫ్ డిజేబుల్డ్" సంఘం సభ్యులకు నా మద్దతు ఎప్పుడు ఉంటుందని అన్నారు. అనంతరం వెల్ఫేర్ అసోసియేషన్ ఆఫ్ డిజేబుల్డ్ సంఘ సభ్యులు మాట్లాడుతూ దివ్యాంగుల బస్ పాస్ కోసం అసెంబ్లీలో మొట్టమొదటిసారి మాట్లాడిన నాయకులు ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్ అని అన్నారు. సూరారం కాలనీకి బస్సు సర్వీసులను పునఃప్రారంభించాలని కోరగా వెంటనే స్పందించి బస్సు సర్వీసులను పునఃప్రారంభించేలా అధికారులకు ఆదేశాలు జారీ చేశారన్నారు. ఈ సందర్భంగా పలువురు అంధులు, వికలాంగులకు ఎమ్మెల్యే చేతుల మీదుగా బహుమతులను ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి, మేడ్చల్ జిల్లా ఫిషరీస్ కో ఆపరేటివ్ చైర్మన్ మన్నె రాజు, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బిఆర్ఎస్ అధ్యక్షులు దూదిమెట్ల సోమేష్ యాదవ్, డివిజన్ అధ్యక్షులు పోలే శ్రీకాంత్, నాయకులు పెద్ద వెంకటస్వామి, గుబ్బల లక్ష్మీనారాయణ, ప్రభాకర్, ఇస్మాయిల్, జావిద్, మధు, వెల్ఫేర్ అసోసియేషన్ ఆఫ్ డిజేబుల్డ్ సంఘ అధ్యక్షులు అంజయ్య, ప్రధాన కార్యదర్శి నరేందర్ రెడ్డి, ఉపాధ్యక్షులు యాదయ్య యాదవ్, సభ్యులు దేవి, శేఖర్, ఆంజనేయులు, సత్యం, వెంకట్రామయ్య తదితరులు పాల్గొన్నారు.

## డిసిసి అధ్యక్షుడు పోదెం వీరయ్యను సన్మానించిన కాంగ్రెస్ సీనియర్ నేత



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: డిసిసి జిల్లా అధ్యక్షులు పోదెం వీరయ్య ని రామవరం సీనియర్ కాంగ్రెస్ నాయకులు భద్రాచలం క్యాంపు కార్యాలయం లో బుధవారం కలిసి శాలువాతో సన్మానించారు. రామవరం నెలకొన్న సమస్యలు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. దానికి ఆయన స్పందించి కాంగ్రెస్ పార్టీ మీకూ అండగా వుంటుంది అని అన్నారు. ఈ కార్యాక్రమంలో (మాజీ )బీసీ సెల్ జిల్లా కన్వీనర్ పనివేల సత్యరాజు, సీనియర్ నాయకులు కాల్వా నారాయణ, మాల మహానాడు టౌన్ కో కన్వీనర్ జెట్టి మోహన్, యువజన నాయకులు పండలనేనీ కళ్యాణ్ ఉద్యమకారుడు బత్తిని రాజశేఖర్, మెల్లం పురుషోత్తం, మణికంఠ పాల్గొన్నారు.

## ధాన్యం, పత్తి కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై కలెక్టర్,ఎస్పీలతో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సమావేశం




ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: హైదరాబాద్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయం నుండి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఏ.శాంతికుమారి, రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లు,ఎస్పీలు, సంబధిత అధికారులతో గ్రూప్ 3, పరీక్షల నిర్వహణ, ధాన్యం, పత్తి కొనుగోలు కేంద్రాల ఏర్పాటు, నిర్వహణ, సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే, నర్సింగ్, పారామెడికల్ కాలేజ్, తదితర అంశాలపై తీసుకోవాల్సిన చర్యల గురించి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.ఐ డి ఓ సి కార్యాలయం వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి కలెక్టర్ జితేష్ వి. పాటిల్ , ఎస్పీ రోహిత్ రాజ్, అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్ తో కలిసి పాల్గొన్నారు.ఈ వీడియో కాన్ఫరెన్స్ లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, సిపిఓ సంజీవరావు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బాబురావు, పౌరసరఫరాల శాఖ అధికారులు రుక్మిణి, త్రినాధ్ బాబు సంబధిత అధికారులు పాల్గొన్నారు

## బండి రాజుల శంకర్ కు ఘన సన్మానం



యాదాద్రి, భువనగిరి, (ప్రజాస్ఫూర్తి) : తెలంగాణ సిటిజన్ కౌన్సిల్ హైదరాబాద్ ఇటీవల మహాత్మా గాంధీ గ్లోబల్ పీస్ అవార్డు 2024 ను యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు పట్టణానికి చెందిన కవి,రచయిత విద్యావేత్త శ్రీ రామకృష్ణ విద్యాలయ కరస్పాండెంట్ , ప్రిన్సిపాల్ బండి రాజుల శంకర్ అందుకోవడం సంతోషకరమని యాదాద్రి భువనగిరి జిల్లా ట్రస్మా అధ్యక్షులు పగిడాల జలంధర్ రెడ్డి అన్నారు. బుధవారం ఆయన శాలువా తో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ట్రస్మా జిల్లా అధ్యక్షులు జలంధర్ రెడ్డి మాట్లాడుతూ కవి, రచయిత విద్యావేత్త బండి రాజుల శంకర్ కు అవార్డు రావడం చాలా సంతోషకరమని అన్నారు. ఇలాంటి మరెన్నో అవార్డులు అందుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్మా ప్రధాన కార్యదర్శి దుర్గ ప్రసాద్, రంగారావు ప్రభాకర్ రెడ్డి, రామ్ రెడ్డి, శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

# రాజాపేట మండలంలో కలెక్టర్ సుడిగాలి పర్యటన

రాజాపేట, (ప్రజాస్ఫూర్తి) : రాజపేట మండలాన్ని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు బుధవారం సుడిగాలి పర్యటన చేశారు. తహసిల్దార్ కార్యాలయం, రేణిగుంటలోని ధాన్యం కొనుగోలు కేంద్రం, రాజపేటలోని ఉన్నత పాఠశాల, బసంతాపురంలోని ఇంటింటి సర్వే కార్యక్రమాలను ఆయన సందర్శించారు. రాజపేట తాసిల్దార్ కార్యాలయ రికార్డు రూమ్ సందర్శించి బయట వ్యక్తులను రానివ్వకూడదని, కార్యాలయం పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. దరఖాస్తు చేసిన రైతులకు నిజప్రతులు వెంటనే ఇవ్వాలన్నారు. ధరణి సబ్ రిజిస్టార్ రూమ్ దర్శించి స్లాట్ బుక్ చేసుకున్న రైతులకు వాస్తవ రికార్డుల పరిశీలన ద్వారా అందుబాటులో ఉండి సమయం ప్రకారం రిజిస్ట్రేషన్లు చేయాలన్నారు. సిబ్బందిని కుల ఆదాయ ధ్రువీకరణ పత్రాలు , కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్ దరఖాస్తులను పెండింగ్ లేకుండా చూడాలని మీసేవ సర్టిఫికెట్స్ అన్ని పెండింగ్ లేకుండా పూర్తి చేయాలన్నారు.ధరణి లో రైతుల నుంచి వచ్చిన అప్లికేషన్లు సమస్యలు పరిష్కరించాలన్నారు. అనంతరం రాజపేట జడ్.పి.హెచ్.ఎస్ పాఠశాలలో



మధ్యాహ్న భోజనం పథకం వంటవారిని విద్యార్థులను వివరాలు అడిగారు. మధ్యాహ్నం భోజనాన్ని స్వయంగా వడ్డించి పిల్లలతో మాట్లాడారు. నిర్వహణ పట్ల ప్రధానోపాధ్యాయురాలు సట్టు జయంత ఉపాధ్యాయ సిబ్బందిని అభినందించారు. విద్యాబోధన గూర్చి అడిగి తెలుసుకున్నారు. అసంపూర్తిగా ఉన్న భవనం నిర్మాణం పూర్తయితే తరగతి గదుల కొరత తీరుతుందని ప్రధానోపాధ్యాయురాలు ఉపాధ్యాయ బృందం కలెక్టర్ కు తెలియజేశారు. రేణిగుంట గ్రామంలో దాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించి రైతులకు ఇబ్బంది లేకుండా మాచర్ సరిగా చూసి సీరియల్ పద్ధతిన ధాన్యం కొనుగోలు చేసి వెనివెంటనే ధాన్యమును రైస్ మిల్లులకు తరలించాలని తెలిపారు. సన్న వడ్లను వెంటనే రైస్ మిల్ కు పంపించాలని సూచించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణ పట్ల పిఎసిఎస్ చైర్మన్ చింతలపూరి భాస్కర్ రెడ్డి, సెక్రటరీ సిల్వేరు చంద్రశేఖర్ సిబ్బందిని అభినందించారు. బసంతాపురం గ్రామంలో సమగ్ర కుటుంబ సర్వే పరిశీలించి ఏలాంటి తప్పులు దొరలకుండా విధించిన సమయంలో గా సర్వే పూర్తి చేయాలని ఎన్యుమ రైటర్లను ఆదేశించారు. ఆయన వెంట మండల స్పెషల్ ఆఫీసర్ శ్యాంసుందర్, తాసిల్దార్ దామోదర్ యాదవ్, సీనియర్ అసిస్టెంట్ యాదగిరి, ఏ ఆర్ ఐ నర్సింలు, ఎంపీ ఓ ఆవుల కిషన్ , అగ్రికల్చర్ ఏవో పద్మజ తదితరులు పాల్గొన్నారు.

# ఒక ప్రణాళిక ప్రకారం షెడ్యూల్ చేసుకొని సర్వే నిర్వహించాలి

* **ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ప్రత్యేక అధికారి దివ్య దేవరాజన్**

మేడ్చల్ ప్రతినిధి, (ప్రజాస్ఫూర్తి ) : ఒక ప్రణాళిక ప్రకారం షెడ్యూల్ చేసుకొని సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే నిర్వహించాలని ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ప్రత్యేక అధికారి దివ్య దేవరాజన్ అన్నారు. బుధవారం మేడ్చల్ కలెక్టరేట్ జిల్లా విసి హాల్ లో కుటుంబ సర్వే, ధాన్య సేకరణ అంశాల పై మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతం తో కలిసి ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ప్రత్యేక అధికారి హోదాలో దివ్యా దేవరాజన్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక అధికారి మాట్లాడుతూ సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో సర్వేకు వచ్చే సమయాన్ని ముందుగానే కుటుంబాలకు తెలిపి, అవసరమైన డాక్యుమెంట్లను అందుబాటులో ఉంచుకునే విధంగా చర్యలు తీసుకోవాలని మేడ్చేల్ మల్కాజిగిరి జిల్లా సర్వే నోడల్ అధికారులకు సూచించారు. ఎన్యుమరేటర్లు డాక్యుమెంట్లు చూసి తప్పులు జరుగకుండా ప్రొఫార్మాలను పూరించాలని, ఏదైన సందేహం ఉంటే సూపర్ వైజర్, నోడల్ అధికారి దృష్టికి తీసుకురావలని సూచించారు. ఈ జిల్లాలో వలసదారులు ఎక్కువగా ఉన్నందున వారు స్వచ్ఛంధంగా కోరిన చోట నమోదు



చేయించాలన్నారు. ఎన్యుమరేటర్లు కుటుంబ సభ్యులతో సౌమ్యంగా మాట్లాడి సమాధానలు తెలుసుకుంటూ, ప్రత్యేక్షంగా పరిశీలించిన అంశాలను ప్రొఫార్మాలో కొంత వరకు పూరించాలని అన్నారు. సర్వే నిర్వహణలో కలిగే సమస్యలను నోడల్ అధికారులు చొరవ తీసుకొని పరిష్కరించాలన్నారు. అంతకు ముందు జిల్లా నోడల్ అధికారులతో తమ పరిధిలో క్షేత్రస్థాయిలో జరుగుతున్న సర్వే వివరాలను అడిగి తెలుసుకున్నారు. సర్వేలో ఎదురయ్యే ఇబ్బందులను, సమస్యలను నోడల్ అధికారులతో అడగి తెలుసుకున్నారు. సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే సమగ్ర సమాచారాన్ని ప్రత్యేక అధికారి దివ్య దేవరాజన్ కు మేడ్చెల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతం సవివరంగా వివరించారు. జిల్లాలో గ్రూప్ 3 పరీక్షలు ఉన్నందున, సర్వే పూర్తి కావడానికి ఇంకా కొంత సమయం అవసరమవుతుందని కలెక్టరు తెలిపారు. అనంతరం కలెక్టరేట్ లోని ఇందిరామహిళా శక్తి క్యాంటీన్ ను పరిశీలించి, పదార్ధాలను రుచి చూసారు. ఈ సమవేశంలో జిల్లా అదనపు కలెక్టరు విజయేందర్ రెడ్డి, ఆర్డిఓలు సైదులు, శ్యాం ప్రకాష్, డిఆర్డిఓ సాంబశివరావు, జిల్లా ఎస్సీ అభివృద్ధి శాఖ అధికారి వినోద్ కుమార్, జిల్లా సంక్షేమ శాఖధికారి స్వర్ణలత, జిల్లా వ్యవసాయ శాఖాధికారి చంద్రకళ, జిల్లా పౌర సరఫరా డిఎం సుగుణబాయి, జిల్లాయువజన అధికారి గోపాల్ రావు, జిల్లా మత్స్య శాఖ అధికారి, జిల్లా పరిశ్రమలశాఖాధికారి ప్రశాంత్, ఎస్సీ కార్పొరేషన్ అధికారి బాబు మోసిస్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## క్రీడల్లో గెలుపు ఓటములు సహజం

* **ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి**



ప్రజాస్ఫూర్తి, కాప్రా : క్రీడల్లో గెలుపు ఓటములు సహజం అని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు.మల్లాపూర్ డివిజన్ పరిధిలోని కె ఎల్ రెడ్డి నగర్ లోని ఇంటర్ స్కూల్స్ బాక్స్ క్రికెట్ టోర్నమెంట్ 2024 ముగింపు కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రీడల్లో రాణించి సమాజానికి తల్లిదండ్రుల కు మంచి పేరు తీసుకురావాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మల్లాపూర్ డివిజన్ కార్పొరేటర్ దేవేందర్ రెడ్డి, బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## రాజాపేట లో హోరా హోరీగా గురుకుల జోనల్ స్థాయి క్రీడలు





రాజాపేట , (ప్రజాస్ఫూర్తి) : రాజాపేట గురుకుల విద్యాలయంలో బుధవారం జరిగిన పదవ జోనల్ స్థాయి క్రీడల పోటీలు ఉత్తేజనిస్తూ ఉత్సాహంగా జరిగాయి. మూడవరోజు వాలీబాల్ అండర్ 19 ఫైనల్ మోత్కూరు జట్టు పై రాజపేట జట్టు ఘనవిజయం సాధించించగా, ఖోఖో ఫైనల్ అండర్ 14 ఫైనల్ లో హుజూర్ నగర్ పై మునగాల జట్టు ఘనవిజయం సాధించింది.టెన్నికాయిట్ ఫైనల్ డబుల్ అండర్ 14 నకిరేకల్ జట్టుపై స్టేషన్ ఘనాపూర్ జట్టు విజయం సాధించింది. టెన్నికాయిట్ ఫైనల్ అండర్ 17 అనుముల జట్టుపై స్టేషన్ ఘనాపూర్ జట్టు విజయం సాధించింది. టెన్నికాయిట్ అండర్ 19 ఫైనల్ భువనగిరి జట్టుపై స్టేషన్ ఘనాపూర్ జట్టు ఘన విజయం సాధించింది.బాల్ బ్యాడ్మింటన్ అండర్ 17 ఫైనల్ చండూరు జట్టుపై మిర్యాలగూడ జట్టు విజయం సాధించింది.బాల్ బ్యాడ్మింటన్ అండర్ 19 ఫైనల్ స్టేషన్ ఘనాపూర్ జట్టు పై మిర్యాలగూడ జట్టు విజయం సాధించింది. అథ్లెటిక్స్ లో విజయం సాధించిన జట్లకు స్థానిక ప్రిన్సిపాల్ సుధాకర్, వైస్ ప్రిన్సిపాల్ రాజు బహుమతులు బహుకరించారు. ఈ క్రీడ పోటీలను జోనల్ ఆఫీసర్ విద్యా రాణి,డి సి ఓ జగదీశ్వర్ రెడ్డి,స్థానిక ప్రిన్సిపాల్ సుధాకర్,క్రీడల సమన్వయకర్త జి.శ్రీనివాస్, పిడి వెంకటేశ్వర్లు,సీనియర్ వైస్ ప్రిన్సిపాల్ బి.రాజు,జెవిపి శోభ రాణి,పి. ఈ. టి.శృతి తదితరులు పర్యవేక్షించారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేత

ప్రజాస్ఫూర్తి , నాగారం:తిరుమలగిరి మున్సిపాలిటీ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం స్థానిక శాసనసభ్యులు మందుల సామెల్ సిఎం రిలీఫ్ ఫండ్ కింద మంజూరైన చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం రిలీఫ్ ఫండ్ పథకం పేదలకు వరం లాంటిది అని అన్నారు.నాగారం మండలంలో 24 మంది లబ్ధిదారుల గాను రూ.9,80,000 ల చెక్కులను బాధిత కుటుంబ సభ్యులకు అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పసుపులేటి వెంకట్ రెడ్డి , పాశం యాదవ రెడ్డి , బత్తుల కరుణాకర్, గట్టు లక్ష్మీకాంత్, పానుగంటి నరసింహారెడ్డి, కసిరెడ్డి రామిరెడ్డి, జాన్, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



## ఆల్ ఇండియా దళిత్ రైట్ మూమెంట్ రెండవ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలి

* డిహెచ్పిఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఏసురత్నం



ప్రజాస్ఫూర్తి, కాప్రా: ఆల్ ఇండియా దళిత్ రైట్ మూమెంట్ రెండవ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని మహాసభల పోస్టర్లు ఆవిష్కరించిన డిహెచ్పిఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఏసురత్నం , డిహెచ్పిఎస్ మేడ్చల్ జిల్లా అధ్యక్షులు జి లక్ష్మీనారాయణ, డిఎస్పిఎస్ మేడ్చల్ జిల్లా కార్యదర్శి సహదేవ్, ఈసీఐఎల్ సిపిఐ పార్టీ కార్యాలయంలో ఆవిష్కరణ చేయడం జరిగింది ఈ సందర్భంగా ఏసురత్నం మాట్లాడుతూ ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్ అమలు చేయాలని తద్వారా సామాజిక న్యాయానికి బాట వేయాలని కోరారు. ఈ జాతీయ సమావేశానికి ముఖ్యఅతిథిగా మల్లు భట్టి విక్రమార్క ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి, ఎమ్మెల్యే గడ్డం వివేక్, ఎమ్మెల్యే కోణంనేని సాంబశివరావు, ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి, ఎక్స్ ఎమ్మెల్యే జాతీయ మహాసభలకు హాజరు కావడం జరుగుతుంది. జనవరి 2న మహాసభలకు అందరూ కదలి రావాలని పిలుపు ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమానికి సహ కార్యదర్శి మహేష్, నరసింగరావు, ఎల్లయ్య, మరియమ్మ, విజయ, యాకమ్మ, కృపాకర్, రజిని తదితరులు పాల్గొన్నారు.


## గుంపెన గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన జిల్లా ఎస్పీ



ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: అన్నపురెడ్డిపల్లి మండల పరిధిలోని గుంపెన గ్రామంలో ఏర్పాటు చేసిన ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు సందర్శించారు.అక్కడ విధుల్లో ఉన్న అధికారులను కొనుగోలు ప్రక్రియను గురించి అడిగి తెలుసుకున్నారు.అనంతరం కొనుగోలు కేంద్రం వద్ద ఉన్న రైతుల సమస్యలు తెలుసుకొని సంబంధిత అధికారులుదృష్టికి తీసుకెళ్లి వాటిని పరిష్కరిస్తామని తెలిపారు. రైతులు కష్టపడి పండించిన ధాన్యాన్ని మాయమాటలు చెప్పే దళారులకు అమ్మి మోసపోవద్దని సూచించారు. దాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద ఎలాంటి సమస్యలు ఎదురైనా వెంటనే స్థానిక పోలీస్ అధికారులకు వెంటనే సమాచారం అందించాలని కోరారు.ఈ కార్యక్రమంలో కొత్తగూడెం డిఎస్పి రెహమాన్, ఎస్బి ఇన్స్పెక్టర్ నాగరాజు, అన్నపురెడ్డిపల్లి ఎస్సై చంద్రశేఖర్, చంద్రుగొండ ఎస్సై స్వప్న , తదితరులు పాల్గొన్నారు.

## కులగణన సర్వేకు అందరు సహకరించండి

* టీపీసీసీ సభ్యులు నాగా సీతారాములు



ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర కుల గణన సర్వేకు అన్ని వర్గాల ప్రజలు సహకరించాలని టీపీసీసీ సభ్యులు నాగా సీతారాములు అన్నారు. సుజాతనగర్ లో నిర్వహిస్తున్న సమగ్ర సర్వేలో భాగంగా తమ ఇంటివద్ద కుటుంబ వివరాలు నమోదు చేసిన అనంతరం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఈ నెల 6 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా సామాజిక, రాజకీయ, ఆర్థిక, విద్యా, ఉపాధి సర్వే చేస్తోందని, రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కుల గణన సర్వే పట్ల సామాజిక మధ్యమాల్లో వస్తున్న అసత్య ప్రచారాలను ప్రజలెవరు నమ్మొద్దని అన్నారు. విద్యావంతులు కూడ కొంతమంది సర్వేకు వ్యతిరేకంగా సామాజిక మధ్యమాల్లో మాట్లాడడం విచారకరమన్నారు. అణగారిన వర్గాల ప్రజలకు సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ రంగాల్లో సమన్యాయం చేయడానికే తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా సర్వే చేపట్టినట్లు ఆయన పేర్కొన్నారు.

# వైద్యులపై దాడులకు పాల్పడితే కఠిన చర్యలు : జిల్లా కలెక్టర్




ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం : ఆసుపత్రులలో పనిచేసే వైద్యులపై జరుగుతున్న దాడులను అరికట్టెందుకు చట్టపరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జితేశ్ వి పాటిల్అన్నారు. క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్ పై బుధవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయనతో పాటు జిల్లా ఎస్పీ రోహిత్ రాజు, అదనపు కలెక్టర్ విద్యా చందన పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ఆసుపత్రిలో రోగుల హక్కులు , వారికి అందుతున్న వైద్య సదుపాయాలు అక్కడ పనిచేస్తున్న డాక్టర్ల ,సిబ్బంది యొక్క అర్హతను ఆసుపత్రికి వచ్చే రోగులకు తెలిసేలా ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని, అలాగే అర్హతకు మించి వైద్యం చేస్తున్న వారిపై క్లినికల్ ఎస్టాబ్లిష్ మెంట్ యాక్ట్ ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే సూచించారు. అనంతరం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు మాట్లాడుతూ రహదారులపై జరుగుతున్న ప్రమాదాల్లో క్షతగాత్రులకు తక్షణ వైద్యం అందించేందుకు దగ్గరలో ఉన్న ఆస్పత్రులకు తరలించి తక్షణ చికిత్స అందేందుకు జియో ట్యాగింగ్ చేయాలని, ప్రమాదకరంగా ప్రదేశాలను గుర్తించాలని సూచించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ భాస్కర్ నాయక్ మాట్లాడుతూ ప్రతి ఆసుపత్రిలో రక్త పరీక్ష కేంద్రాల్లో పరీక్షల యొక్క ధరల పట్టికను ప్రజలకు తెలిసేలా ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఐ.ఎం.ఎ అధ్యక్షులు అరికల భాస్కర్ మాట్లాడుతూ క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్ ప్రకారం అనుమతులు లేని ఆసుపత్రులను ,క్లినిక్ లాబ్లను సీజ్. చేసి ,నిర్వాహకులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో క్లినికల్ ఎస్టాబ్లిష్ మెంట్ యాక్ట్ సభ్యులు డా. మధువరన్, డిప్యూటీ డెమో ఫైజ్ మొహియుద్దీన్, ఉమా మహేశ్వరీ, వివేక్ తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ నిర్మాణాలపై చర్యలేవి?

* గాజుల రామారంలో అనుమతి లేకుండా ఆకాష హర్మ్యాలు:
* నోటీసులు ఇస్తే సరిపోతుందా?:
* విధులు మరచిన టౌన్ ప్లానింగ్ అధికారులు!:
* ప్రభుత్వ ఆదేశాలు బేఖాతర్:







ప్రజాస్ఫూర్తి,కుత్బుల్లాపూర్: అనుమతి లేని అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకుంటాం అని ప్రభుత్వ పెద్దలు పదే పదే చెబుతున్నా క్షేత్ర స్థాయిలో కొందరు అధికారులు మాత్రం అక్రమ నిర్మాణాలకు అండగా మేముంటాం అన్నట్టుగా విధులు నిర్వహిస్తున్నారు.ప్రదానంగా గాజుల రామారం సర్కిల్ పరిధిలోని మహాదేవపురం కాలనీ, శ్రీరామ్ నగర్,కైలాష్ హిల్స్,షిరిడి హిల్స్ ప్రాంతాలలో ప్రభుత్వ నిబంధనలు బేఖాతర్ చేస్తూ ఎలాంటి ప్రభుత్వ అనుమతి లేకుండా బహుళ అంతస్థుల భవనాలు నిర్మిస్తున్నారు. నోటీసులకే పరిమితమా? జీహెచ్ఎంసిలో ప్రభుత్వ ఆదాయానికి ప్రధాన వనరులు గా వున్న పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు ప్రభుత్వ అదాయానికి గండి కొడుతూ ఆకాశ హర్మ్యాలు నిర్మిస్తున్నా చేష్టలుడిగి చూస్తున్నారు. గాజుల రామారం సర్కిల్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న టౌన్ ప్లానింగ్ అధికారులు తమ పరిధిలోని బస్తిలు, కాలనీలలో క్షేత్ర స్థాయిలో పర్యటించకుండా కింది స్థాయి సిబ్బంది చేత అడపా దడప ఒకటి రెండు అనుమతి లేని నిర్మాణాలకు నోటీసులు ఇస్తూ తరువాత మమ అనిపిస్తున్నారనే విమర్శలు జోరుగా వినిపిస్తున్నాయి! ఇప్పటికైనా అధికారులు దృష్టి సారించి అక్రమ నిర్మాణాలపై ఉక్కుపాదం మోపి నిర్మాణదారులు ప్రభుత్వ అనుమతి పొందేలా తద్వారా ప్రభుత్వ ఆదాయాన్ని పెంచేలా చూడాలని స్థానికులు కోరుతున్నారు.



## నేరాల నియంత్రణకు సిసి కెమరాలు దోహదం

- ముస్తాబాద్ ఎస్ఐ గణేష్
- 5 సిసి కెమరాలను ప్రారంభించిన ఎస్ఐ

ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: నేరాల నియంత్రణకు సిసి కెమరాలు దోహదపడుతాయని ముస్తాబాద్ ఎస్ఐ గణేష్ అన్నారు. ముస్తాబాద్ మండలం పోతుగల్ గ్రామంలోని ఎల్లమ్మ ఆలయంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 5 సిసి కెమరాలను ముస్తాబాద్ ఎస్ఐ గణేష్ బుధవారం ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిసి కెమరాలు నిరంతరం నిఘా నేత్రాలుగా పని చేయాలని అన్నారు. సిసి కెమరాల ఏర్పాటుతో ఏదైనా నేరం జరిగినప్పుడు నిందితులను గుర్తించి, కేసును చేధించడంలో సిసి కెమరాలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. తద్వారా నేరాలను చాలా వరకు నియంత్రించవచ్చని అన్నారు. గ్రామాల్లో ప్రధాన కూడళ్లు, దుకాణాల్లో, ఆలయాల్లో, వీలైతే ఇండ్లలో సిసి కెమరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. సిసి కెమరాల ఏర్పాటుకు ప్రతీ ఒక్కరూ పోలీసు శాఖకు సహకరించాలని కోరారు. ఎల్లమ్మ ఆలయంలో సిసి కెమరాలు ఏర్పాటు చేసిన గౌడ సంఘంను ఈ సందర్భంగా ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ, గౌడ సంఘం నాయకులున్నారు.

# నాగారం పోలీస్ స్టేషన్ ను తనిఖీ చేసిన ఎస్పీ సన్ ప్రీత్ సింగ్






ప్రజాస్ఫూర్తి నాగారం: నాగారం మండల పోలీస్ స్టేషన్ బుధవారం జిల్లా ఎస్పీ సన్ ప్రీత్ సింగ్ తనిఖీ చేశారు అనంతరం స్టేషన్ పరిసరాలు, కేసుల్లో సీజ్ చేసిన వాహనాల శ్రేణిని తనిఖీ చేసి అలాగే పోలీస్ స్టేషన్ రిసెప్షన్, పిర్యాదు నిర్వహణ, స్టేషన్ రికార్డ్స్, హిస్టరీ షీట్స్, మండల భౌగోళిక స్థితి, నేరాల నమోదు, కేసుల స్థితిగతులు, కోర్టు క్యాలెండర్, సాంకేతికత మొదలగు వాటిని పరిశీలించారు. అక్రమ రవాణా, అసాంఘి కార్యకలాపాలను నిరోదించాలని సిబ్బందిని ఆదేశించారు. పారదర్శకంగా పోలీసింగ్ ఉండాలి అన్నారు. ప్రజలకు పోలీసు సేవలను వేగంగా అందించాలని సిబ్బందికి తెలిపినారు. సాంకేతిక ను సద్వినియాగం చేసుకుని జట్టుగా పని చేయాలని కోరినారు. గంజాయి రవాణా, వినియోగం నిరోదించేలా బాధ్యతగా పని చేయాలని అన్నారు. పెట్రోలింగ్ పెంచాలని, డయల్ 100 కాల్స్ పై సిబ్బంది వేగంగా స్పందించాలని అన్నారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా అవగాహన కల్పించాలని, రోడ్డు ప్రమాదాల నివారణకు పని చేయాలని అన్నారు. సైబర్ నేరాలు జరగకుండా ప్రజలు సైబర్ మోసాలకు గురి కాకుండా అవగాహన కల్పించాలని కోరారు. సిబ్బంది బాధ్యతగా పని చేయాలి, బాగా పని చేసే సిబ్బందికి రీవార్డ్స్, ప్రోత్సాహకాలు ఉంటాయి అని తెలిపినారు. విధులు నిర్వహణ తోపాటు ఆరోగ్యపరమైన జాగ్రత్తలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో డి.ఎస్.పి రవి, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ వీర రాఘవులు, మండల సిఐ రఘువీర్ రెడ్డి, ఎస్సై ఐలయ్య, డి సి ఆర్ బి ఎస్ ఐ యాకూబ్, సి సి సందీప్, డి సి ఆర్ బి ఏ ఎస్ ఐ అంజన్ రెడ్డి, శేఖర్ రెడ్డి, కానిస్టేబుల్స్ ఉన్నారు.

# కోమ్వివా ఏడబ్ల్యూఎస్ కలిసి ఎస్ఏఏఎస్ ఉత్పత్తులు

హైదరాబాద్, ప్రజాస్ఫూర్తి : ఏడబ్ల్యూఎస్ కోమ్వివా ని క్లౌడ్ మొదట అనే ఏ ఐ డ్రైవింగ్ వ్యాపార ఆలోచన ని మార్కెట్ లో తొందరగా ఆచారిస్తున్నాయి. అవి నాన్ లీనియర్ ఆర్థిక పురోగతిని సాధించడానికి సహాయ పడుతున్నాయి. కోమ్వివా అనేది వినియోగదారులకు మంచి అనుభవాలను అందించడానికి సమాచారాన్ని డబ్బులుగా మార్చే పరిష్కారాలకు ఒక అగ్ర నాయకుడని పేర్కొంది.నేడు యమజాన వెబ్ సర్వీసెస్( ఏడబ్ల్యూ ఎస్) అనే ఒక యమజాన్ డాట్ కాం సంస్థ తో తన భాగస్వామ్యాన్ని ప్రకటించింది. ఏడబ్ల్యూఎస్ కామ్వివా ని మొదట క్లౌడ్ ఫర్స్ట్ , ఏ ఐ నడిపించే వాటి ద్వారా నిర్మించాలి అనుకుంటుందని తెలిపింది. అవి మార్కెట్ లో వేగవంతంగా సమయానికి అనుకూలంగా నడుస్తాయని, ఎలాంటి ఇబ్బంది లేని ఆర్థిక ఎదుగుదల ని అందిస్తాయని ప్రకటించింది.ఏడబ్ల్యూఎస్ మీద నిర్మించిన కోమ్వివా కమ్యూనికేషన్స్ సర్వీస్ ప్రొవైడర్స్ (సి ఎస్ పి) కి సాఫ్ట్వేర్ ఉత్పత్తులను, ప్లాట్ఫామ్ లను తరువాత తరం వారికి సాఫ్ట్వేర్ యాజ్ ఏసర్వీస్(ఎస్ ఏ ఏ ఎస్ ) మోడల్ ద్వారా అందిస్తుంది. ఏడబ్ల్యూఎస్ కోమ్వివా కలిసి ఉత్పతిని ఆదునీకరించడం జరిగిందని పేర్కొంది.

## ఆటో డ్రైవర్లందరూ నిబంధనలను ఉల్లంఘించరాదు

* కూకట్ పల్లి, కేపీహెచ్ బీ సిఐలు



కూకట్ పల్లి, (ప్రజాస్ఫూర్తి) : ఆటో డ్రైవర్లందరూ నిబంధనలను ఉల్లంఘించరాదని కూకట్ పల్లి, కేపీహెచ్ బీ సిఐలు అన్నారు. కూకట్ పల్లి ఎసిపి శ్రీనివాస్ రావు ఆదేశాల మేరకు బుధవారం కూకట్ పల్లి, కెపిహెచ్ బి ఎస్ హెచ్ వో లు తమ సిబ్బందితో కలిసి హౌసింగ్ బోర్డ్, కూకట్పల్లి ఆటో స్టాండ్లను సందర్శించారు. ఆటో డ్రైవర్లకు అవసరమైన నిబంధనలను అనుసరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం జరుగుతున్న సంఘటనలను అనుసరించి పలు సూచనలను అందించారు. ఆటో స్టాండ్ ల నుండి నడుస్తున్న మొత్తం ఆటోల జాబితాను సేకరిస్తామని అన్నారు. అడ్డగుట్ట ఆటో స్టాండ్, జేఎన్టీయూ ఆటో స్టాండ్, కూకట్పల్లి బస్ స్టాప్, కెపి హెచ్ బి బస్ స్టాప్, మూసాపేట్ తదితర ఆటో స్టాండ్ ల వద్ద ఆటోలు నడుపుతున్న ఓనర్లు, ఆటో డ్రైవర్ల పూర్తి వివరాలతో పాటు ఆటో ల రిజిస్ట్రేషన్ నంబర్లను కూడా సేకరిస్తున్నామని తెలిపారు. ప్రయాణికులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా బాధ్యతగా మెలగాలని సూచించారు.

# అభివృద్ధి పనులలో నాణ్యత ప్రమాణాలతో నిర్మించాలి

**ఆల్విన్ కాలనీ డివిజన్ కార్పొరేటర్ వెంకటేష్ గౌడ్**

శేరిలింగంపల్లి, (ప్రజాస్ఫూర్తి) : అభివృద్ధి పనులలో నాణ్యత ప్రమాణాలతో నిర్మించాలని ఆల్విన్ కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ అన్నారు. బుధవారం ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని శంషిగుడా లో నిర్మాణ పనులు జరుగుతున్న నూతన సీసీ రోడ్లను డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ రోడ్డు ను నాణ్యత ప్రమాణాలతో నిర్మించి, మంచిగా క్యూరింగ్ చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. సీసీ రోడ్డు నిర్మించిన కార్పొరేటర్ కి కాలనీ వాసులు కృతజ్ఞతలు తెలియచేసారు. ఈ కార్యక్రమంలో సమ్మారెడ్డి, శివరాజ్ గౌడ్, రఘు, ప్రవీణ్, రామరాజు, శివరాజ్ గౌడ్, సాయి కిరణ్, వర్క్ ఇన్స్పెక్టర్ రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.



# లగచర్ల ఘటన వెనక ఉన్న వారి వివరాలు బయటపెడతాం

- పింక్ కలర్ ముసుగులో దౌర్జన్యానికి పాల్పడుతున్నారు
- మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి



**తెలంగాణ బ్యూరో :** వికారాబాద్ ఘటన వెనుక ఉన్ననిందితులను మీడియా ముందు ప్రవేశ పెడతామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. గాంధీ భవన్ లో మంత్రులతో ముఖాముఖి కార్యక్రమంలో పొంగులేటి మాట్లాడారు. రైతుల పేరుతో కొందరు పింక్ కలర్ ముసుగు వేసుకుని దౌర్జన్యానికి పాల్పడ్డారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి చెడ్డపేరు తీసుకువచ్చేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. ఈ ఘటన వెనక ఎవరున్నారో బయటపెడతామని చెప్పారు.

# పట్నం నరేందర్ రెడ్డి అరెస్టు

**లగచర్ల ఘటనలో కీలక నిందితుడితో ఫోన్ లో మాట్లాడినట్లు పోలీసుల గుర్తింపు**



- వికారాబాద్ లోని డీటీసీ సెంటర్ కు తరలింపు
- కీలక నిందితుడు సురేశ్ పరారీ
- నాలుగు బృందాలతో గాలింపు

**తెలంగాణ బ్యూరో :** బీఆర్ఎస్ నాయకుడు కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్రెడ్డి ని బుధవారం పోలీసులు అరెస్ట్ చేశారు. తొలుత ఫిల్మ్‌నగర్‌లోని ఆయన నివాసంలో అదుపులోకి తీసుకుని వికారాబాద్‌లోని డీటీసీ సెంటర్‌కు తరలించారు. వైద్యపరీక్షలు నిర్వహించిన అనంతరం కోర్టులో హాజరుపరచనున్నారు. లగచర్ల లో కలెక్టర్ పై దాడి ఘటనలో సురేశ్ తో మాట్లాడినట్లు నరేందర్ రెడ్డి మాట్లాడినట్లు సమాచారంతో అరెస్టు చేసినట్లు తెలుస్తోంది. కాగా సురేశ్ అనే కీలక నిందితుడు పరారీలో ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. అతడి కోసం నాలుగు పోలీసు బృందాలు గాలిస్తున్నాయి. లగచర్లలో ఫోన్‌కాల్స్ డేటాను పోలీసులు విశ్లేషిస్తున్నారు. సెల్‌ఫోన్ టవర్ లొకేషన్ ఆధారంగా దర్యాప్తు కొనసాగిస్తున్నారు. సూత్రధారుల వ్యవహారంలో కీలక సమాచారాన్ని సేకరించినట్లు తెలుస్తోంది.నరేందర్‌రెడ్డిని పోలీసులు అరెస్ట్ చేయడంతో తీసుకోవడంతో ఆయన కుటుంబసభ్యులను మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి పరామర్శించారు. ఫిల్మ్‌నగర్‌లోని ఆయన నివాసానికి చేరుకుని వారితో మాట్లాడారు.లగచర్ల ఘటనలో మంగళవారం 16 మందిని రిమాండ్‌కు తరలించిన పోలీసులు బుధవారం మరో నలుగురిని అరెస్ట్ చేశారు. వీరిలో ప్రధాన నిందితుడు సురేశ్ సోదరుడితో పాటు మరో ముగ్గురు ఉన్నారు. వారిని వైద్య పరీక్షల కోసం పరిగి ఆస్పత్రికి తీసుకెళ్లారు. కాసేపట్లో నిందితులను కోర్టులో హాజరుపరచను

## పట్నం నరేందర్ రెడ్డిని వెంటనే విడుదల చేయాలి

- బీఆర్ఎస్ నాయకుల నిరసన

**తెలంగాణబ్యూరో:** కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి అక్రమ అరెస్టుకు వ్యతిరేకంగా జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు కొనసాగుతున్నాయి. నరేందర్ రెడ్డి వెంటనే విడుదల చేయాలని కోస్గిలో బీఆర్ఎస్ నాయకుల రాస్తారోకో చేపట్టారు. రోడ్డుపై బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. తప్పుడు కేసులతో ప్రశ్నించే గొంతులను అణిచివేయలేరన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కక్ష పూరిత రాజకీయాలకు పాల్పడతు న్నదని ఆరోపించారు. ఆందోళనలు చేపట్టిన బీఆర్ఎస్ నాయకులను పోలీసులు అడ్డుకున్నారు. బలవంతంగా వాహనాల్లో అక్కడ నుంచి తరలించారు.





# సన్న వడ్లకు బోనస్ అంతా బోగస్

- ప్రభుత్వం చెప్పింది అంతా అబద్ధం
- కామారెడ్డి జిల్లాలో అదనపు కలెక్టర్ ను నిలదీసిన రైతులు
- ధాన్యంలో కోతలు విధిస్తున్నారని ఫిర్యాదు
- సన్నవడ్ల కొనుగోలులో నిర్లక్ష్యం చేస్తున్నారని మండిపాటు

**తెలంగాణ బ్యూరో:** ధాన్యం కొనుగోళ్లలో జాప్యంపై రాష్ట్ర వ్యాప్తంగా రైతులు ఆందోళనకు దిగుతున్నారు. ప్రభుత్వం స్పందించక పోవడంతో ధాన్యాన్ని దళారులకు అమ్ముకోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాజాగా కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి మండలంలోని అజమాబాద్ గ్రామంలో అదనపు కలెక్టర్ ఎదుట రైతులు నిరసన తెలిపారు. సన్న వడ్ల కొనుగోలులో సొసైటీ నిర్లక్ష్యంపై అసహనం వ్యక్తం చేశారు. గ్రామాన్ని సందర్శించిన అదనపు కలెక్టర్ విక్టర్ ఎదుట రైతులు తమ సమస్యలను ఎకరవు పెట్టారు. సొసైటీ తీరుపై తీవ్ర విమర్శలు గుప్పించారు. రైస్ మిల్లర్లు ధాన్యం కటింగ్ తీస్తుండడంతో తమకు ఆర్థిక నష్టం కలుగుతోందని, సొసైటీ అధికారులు సన్న వడ్ల కొనుగోలు విషయంలో నిర్లక్ష్యం చూపిస్తున్నారని రైతులు పేర్కొన్నారు. తక్షణమే సొసైటీ విధానంలో మార్పులు చేసి ధాన్యం కొనుగోళ్లను చేపట్టాలని రైతులు డిమాండ్ చేశారు. సన్న వడ్ల విషయంలో బోనస్ గురించి కూడా ఏం చెప్పడం లేదని మండిపడ్డారు. బోనస్ ఇస్తామన్న విషయం అంతా బోగస్ అంటున్నారు. తక్కువ ధరకు ధాన్యాన్ని దళారులకు అమ్ముకోవాల్సిన పరిస్థితి వచ్చిందని చెబుతున్నారు.

# రైతులపై పోలీసుల చిత్రహింస

## రైతులు జైలుకు వెలుతుంటే సీఎం ఎక్కడికి పోయిండు

- రేవంత్ రెడ్డి అల్లుడి కంపెనీ కొసమే భూములు గుంజుకుంటున్నారు
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- రైతులను తీవ్రవాదుల్లా చూస్తున్నారు.
- మా కార్యకర్త మా నాయకుడితో మాట్లాడితే తప్పేంటి
- పట్నం నరేందర్ రెడ్డిని అరెస్టు కాదు కిడ్నాప్ చేశారు



**తెలంగాణ బ్యూరో:** కొడంగల్ నియోజకవర్గంలో రైతులు జైలుకు వెళుతుంటే సీఎం రేవంత్ రెడ్డి ఎక్కడున్నాడని, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు. బుధవారం తెలంగాణ భవన్ లో మీడియా తో మాట్లాడారు. కొడంగల్‌లో జరిగింది కుట్ర కాదని, సీఎం రేవంత్ వైఖరి వల్లే ఇలాంటి గొడవలు జరుగుతున్నాయని కేటీఆర్ అన్నారు. ఆరు నెలలుగా కొడంగల్‌లో ఈ వివాదం కొనసాగుతోందన్నారు. సమస్య పరిష్కరించకుండా మహారాష్ట్రలో ఏం చేస్తున్నారని నిలదీశారు. రైతులను తీవ్రవాదుల్లా చూస్తున్నారని మండిపడ్డారు. టెర్రరిస్టుల మాదిరి మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డిని అరెస్టు చేస్తారా అని ప్రశ్నించారు. డబ్బులు సంపాదించి మూటలు మోయడానికే సీఎం పదవి చేపట్టారా.. అని అడిగారు. పట్నం నరేందర్ రెడ్డిని అరెస్ట్ చేయలేదని, కిడ్నాప్ చేశారని ఆరోపించారు. సురేష్ బీఆర్ఎస్ కార్యకర్త అనేది నిజమని, అయితే అతడి భూమి కూడా ఈప్రాజెక్ట్‌లో పోతోందని, మా కార్యకర్త నాయకుడితో మాట్లాడితే తప్పేంటని ప్రశ్నించారు. కొడంగల్ రైతులకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు.న్నారు.సీఎం సొంత అల్లుడు సత్యనారాయణరెడ్డికి చెందిన ఫార్మా కంపెనీ కోసమే ఫార్మా విలేజ్‌ను ఏర్పాటు చేయాలని చూస్తున్నారని ఆరోపించారు. సీఎం అల్లుడు సత్యనారాయణరెడ్డి, అన్న శరత్‌ల ఫార్మా కంపెనీలను విస్తరించటం కోసం ప్రభుత్వం సహకరిస్తోందన్నారు. తీవ్రవాదుల మాదిరి రైతులను పొలాల వెంబడి తరుముతున్నారన్నారు. కలెక్టర్ గన్ మెన్లు ఎక్కడ అని కేటీఆర్ అడిగారు. కలెక్టర్ ప్రతీక్ జైన్‌కు సురేష్ పద్ధతిగా.. మర్యాదగా చెప్తే తప్పా. అన్నారు. రాహుల్ గాంధీ రోజూ తిట్టే అదానీని రేవంత్ కలవటం కూడా తప్పు కాదా అన్నారు.

**న్యాయమూర్తి పర్యవేక్షణలో మెడికల్ ట్రీట్ మెంట్ ఇవ్వాలి**

రైతులపై చిత్రహింసలు పెడుతున్నారని వారిపై న్యాయమూర్తి పర్యవేక్షణలో మెడికల్ ట్రీట్ మెంట్ ఇవ్వాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. తమకు ప్రభుత్వ డాక్టర్లపై నమ్మకం లేదని అందుకే ప్రశ్నిస్తున్నామన్నారు. రైతులకు కనీసం నడవడానికి కూడా రావడం లేదన్నారు. పోలీసులు రైతులను తీవ్రంగా కొట్టారని అన్నారు.

### ప్రజల తిరుగుబాటును బీఆర్ఎస్ కు ఆపాదించే ప్రయత్నం చేస్తున్నారు

సీఎం తన సొంత నియోజకవర్గంలో ప్రజలు చేసిన తిరుగుబాటును బీఆర్ఎస్‌కు ఆపాదించే కుట్రలు చేస్తున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. ప్రజల తరపున పోరాటం చేస్తున్న బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులను అక్రమ కేసులు, అరెస్టులతో భయపెట్టాలని చూస్తే అది మూర్ఖపు చర్య అవుతుందన్నారు. రేవంత్ రెడ్డి అప్రజాస్వామిక చర్యలపై బీఆర్ఎస్ పోరాటం కొనసాగుతూనే ఉంటుందని స్పష్టం చేశారు.ఉద్యమకాలం నుంచి బీఆర్ఎస్ ఇలాంటి నిర్బంధాలు, అక్రమ అరెస్టులను ఎన్నో చూసిందని ఎంత అణిచి వేసే ప్రయత్నం చేస్తే అంత పోరాటం చేస్తామన్నారు. పట్నం నరేందర్ రెడ్డి అరెస్‌ట్‌ను తీవ్రంగా ఖండిస్తున్నానని పేర్కొన్నారు. వెంటనే ఆయనను, లగచర్లలో అరెస్ట్ చేసిన రైతులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు.పట్నం నరేందర్ రెడ్డిని అదుపులోకి తీసుకొని ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే అక్రమ అరెస్‌ట్‌లు తప్పవని బెదిరిస్తున్నారని కేటీఆర్ అన్నారు. ప్రజల తరపున పోరాటం చేస్తున్న బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులను అక్రమ కేసులు, అరెస్టులతో భయపెట్టాలని చూస్తే అది మూర్ఖపు చర్యే అవుతుందని అన్నారు. రేవంత్ రెడ్డి అప్రజాస్వామిక చర్యలపై బీఆర్ఎస్ పోరాటం కొనసాగుతూనే ఉంటుందని స్పష్టం చేశారు. ఉద్యమకాలం నుంచి బీఆర్ఎస్ ఇలాంటి నిర్బంధాలు, అక్రమ అరెస్టులను ఎన్నో చూసిందని కేటీఆర్ తెలిపారు. ఎంత అణిచి వేసే ప్రయత్నం చేస్తే అంత పోరాటం చేస్తామని తెలిపారు. పట్నం నరేందర్ రెడ్డి అరెస్‌ట్‌ను తీవ్రంగా ఖండిస్తున్నానని పేర్కొన్నారు. వెంటనే ఆయనను, లగచర్లలో అరెస్ట్ చేసిన రైతులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

# బతుకమ్మ కుంట సందర్శించిన హైడ్రా కమిషనర్

- ఆందోళనలో చుట్టు పక్కల కాలనీవాసులు
- ఇండ్ల జోలికి వెళ్లమని హామీ



**తెలంగాణ బ్యూరో:** హైడ్రా విషయంలో ఎటువంటి ఆందోళనలు అక్కర్లేదని హైడ్రా కమిషనర్ రంగనాథ్ అన్నారు.బుధవారం అంబర్ పేట బతుకమ్మ కుంటను రంగనాథ్ సందర్శించారు. బతకమ్మ కుంట పునరుద్ధరణపై స్థానికులతో రంగనాథ్ చర్చించారు. తమ ఇళ్లను కూలుస్తారా అని ప్రశ్నించగా ఇళ్లు, నివాస స్థలాల జోలికి వెళ్లబోమని కమిషనర్ స్పష్టం చేశారు. 1962 లెక్కల ప్రకారం బతుకమ్మకుంట 16.13 ఎకరాల విస్తీర్ణంలో ఉందని కానీ ప్రస్తుతం 5.15 ఎకరాలకు కుచించుకుపోయిందన్నారు. రెండు నెలల్లో బతుకమ్మ కుంటను పునరుద్ధరిస్తామన్నారు. హైడ్రా ఎఫెక్టుతో నగరంలో రిజిస్ట్రేషన్లు పడిపోయాయని వస్తున్న ప్రచారంపై స్పందిస్తూ రిజిస్ట్రేషన్లు పెరిగాయని చెప్పడానికి లెక్కలు ఉన్నాయన్నారు. ప్రజలు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని చెప్పారు.

# రామ్ గోపాల్ వర్మకు నోటీసులు



డైరెక్టర్ రామ్ గోపాల్ వర్మకు ప్రకాశం జిల్లా మద్దిపాడు పోలీసులు నోటీసులు ఇచ్చారు. జూబ్లీహిల్స్‌లోని ఆర్జీవీ ఇంటికి వచ్చి మరీ ఆయనకు నోటీసులు అందజేశారు. ఎస్సై శివరామయ్య ఆధ్వర్యంలోని బృందం నోటీసులు ఇచ్చింది. ఎన్నికలకు ముందు వ్యూహం సినిమా ప్రమోషన్ సమయంలో.. నాటి ప్రతిపక్ష నేత చంద్రబాబు, ఆయన కుటుంబ సభ్యులతోపాటు.. జనసేన అధినేత పవన్‌కల్యాణ్ వ్యక్తిత్వాలను కించపరిచేలా వర్మ ఎక్స్‌లో పోస్టులు పెట్టారంటూ ప్రకాశం జిల్లా మద్దిపాడు స్టేషన్‌లో కేసు నమోదైంది. మద్దిపాడు మండల తెదేపా కార్యదర్శి ఎం.రామలింగం ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆదివారం అర్ధరాత్రి పోలీసులు కేసు నమోదు చేశారు. విచారణకు హాజరు కావాలంటూ ఆయనకు నోటీసులు అందజేశారు. కాగా తుళ్లూరులోనూ ఆర్జీవీపై కేసు నమోదు కాగా.. చంద్రబాబు, పవన్ కళ్యాణ్ లోకేశ్ రామ్‌గోపాల్ వర్మ గతంలో మార్ఫింగ్ చేసి అసభ్యకరంగా పోస్టులు పెట్టారని రాష్ట్ర తెలుగు రైతు ఉపాధ్యక్షుడు నూతలపాటి రామారావు తుళ్లూరు పోలీసులకు సోమవారం కంప్లైంట్ చేశారు.

# సిరిసిల్ల లో నేతన్న ఆత్మ హత్య

**తెలంగాణ బ్యూరో :** రాజన్న సిరిసిల్ల జిల్లా పట్టణంలో ఓ నేత కార్మికుడు ఆత్మహత్య చేసుకున్నాడు. గణేశ్ నగర్ కు చెందిన నేత కార్మికుడు ఎర్రం కొమురయ్య (55) ఉపాధి లేక సూసైడ్ చేసుకున్నాడు. ఆర్థిక ఇబ్బందులతో నేతన్నసూసైడ్ చేసుకున్నట్లు తెలుస్తోంది. సిరిసిల్లలో నాలుగు రోజుల కిందట దంపతులు ఆత్మహత్య మరవకముందే మరో నేతన్న ఆత్మ హత్య చేసుకోవడం కలకలం రేపుతోంది. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు.

# ఏసీబీకి పట్టుబడ్డ మున్సిపల్ ఉద్యోగి



**తెలంగాణ బ్యూరో:** నిర్మల్ జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయంలో బుధవారం ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించారు. 15వేల రూపాయల లంచం తీసుకుంటూ మున్సిపల్ జూనియర్ అసిస్టెంట్ షాకీర్ పట్టుపడ్డాడు. బిల్ కలెక్టర్ భరత్ సర్వీస్ బుక్ ఎంట్రీ కొరకు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నట్లు సమాచారం. కాగా, మున్సిపల్ కార్యాలయంలో ఏసీబీ సోదాలు చేస్తుండటంతో ఉద్యోగ వర్గాల్లో కలవరం మొదలైంది.

# కీళ్ల నొప్పులు ఇలా పోగొట్టుకోండి..!



శరీరంలో యూరిక్ యాసిడ్ స్థాయి పెరిగినప్పుడు, కీళ్ల సంబంధిత సమస్యలు కనిపించడం ప్రారంభిస్తాయి. అధిక యూరిక్ యాసిడ్ వల్ల కీళ్లలో వాపు, భరించలేని నొప్పి వస్తుంది. శరీరంలో ప్యూరిన్ స్థాయి పెరిగితే, అది యూరిక్ యాసిడ్ పెరుగుదలకు కారణమవుతుంది. నిజానికి, ప్యూరిన్లు విచ్ఛిన్నమైనప్పుడు శరీరంలో యూరిక్ యాసిడ్ ఏర్పడుతుంది. ప్యూరిన్ రిచ్ ఫుడ్స్ తీసుకోవడం వల్ల యూరిక్ యాసిడ్ పెరుగుతుంది. శరీరంలో పెరిగిన యూరిక్ యాసిడ్‌ను తగ్గించడంలో కొన్ని పదార్థాల వినియోగం ప్రయోజనకరంగా ఉంటుంది. అలాంటి ఆహారాల గురించి తెలుసుకుందాం. కీళ్లలో నిక్షిప్తమైన ప్యూరిన్లు ఆర్థరైటిస్ వంటి వ్యాధులకు కారణమవుతాయి. దీన్ని తగ్గించడానికి, మీరు కొన్ని ప్రత్యేక ఆహారాలను మీ డైట్‌లో చేర్చుకోవచ్చు. కీళ్లలో నిక్షిప్తమైన ప్యూరిన్‌లను తొలగించడంలో సహాయపడే ఆహారపదార్థాల గురించి ఇప్పుడు తెలుసుకుందాం.

### నీ

శరీరంలోని టాక్సిన్స్‌ను బయటకు పంపడంలో నీరు సహాయపడుతుంది. తగినంత మొత్తంలో నీరు తాగడం వల్ల యూరిక్ యాసిడ్‌ను పలుచబడుతుంది. ఇది మూత్రపిండాల ద్వారా సులభంగా విసర్జించబడుతుంది. రోజు మొత్తంలో కనీసం 2-3 లీటర్ల నీరు త్రాగాలి.



### చెర్రీస్:

చెర్రీస్‌లో యాంటీఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి వాపును తగ్గించడంలో సహాయపడతాయి. చెర్రీస్‌లో యూరిక్ యాసిడ్ స్థాయిలను తగ్గించే గుణాలు ఉన్నాయి. మీరు చెర్రీ జ్యూస్ చేసుకుని త్రాగవచ్చు లేదా చెర్రీస్ పండ్ల లాగే కూడా తినవచ్చు.



### పెరుగు:

పెరుగులో జీర్ణక్రియను మెరుగుపరిచే ప్రోబయోటిక్స్ ఉంటాయి. ఇది శరీరంలో యూరిక్ యాసిడ్ ఉత్పత్తిని తగ్గించడంలో సహాయపడుతుంది.



### పచ్చి ఆకు కూరలు:

బచ్చలికూర, మెంతికూర, ఆవాలు వంటి ఆకు కూరల్లో యాంటీ ఆక్సిడెంట్లు, విటమిన్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి శరీరంలోని టాక్సిన్స్ ను తొలగించి యూరిక్ యాసిడ్ స్థాయిలను తగ్గించడంలో సహాయపడతాయి.






### అల్లం:

అల్లంలో యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు ఉన్నాయి. ఇవి మంటను తగ్గించడంలో సహాయపడతాయి. ఇది శరీరంలో యూరిక్ యాసిడ్ స్థాయిలను తగ్గించడంలో కూడా సహాయపడుతుంది. మీరు మీ ఆహారంలో అల్లం టీ లేదా అల్లం కూడా చేర్చుకోవచ్చు.

## కొబ్బరి పాలతో పులావ్.. ఓ సారి ట్రై చేయండి

# హెల్దీ అండ్ టేస్టీ

కొబ్బరి నీళ్లు తాగడం వల్ల ఆరోగ్యానికి ఎన్నో ప్రయోజనాలు చేకూరుతాయని ఆరోగ్య నిపుణులు చెప్తుంటారు. కొబ్బరి కూడా ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. అయితే చాలా మందికి నేరుగా కొబ్బరిని తినడం ఇష్టం ఉండదు. కొంత మందికి కొబ్బరి పాలను తీసి రైస్ వండుకొని తినడం ఇష్టం ఉంటుంది. అయితే ఈరోజు ఆ కొబ్బరి పాలతో రైస్ ఎలా వండుకోవాలి, దానికి కావాల్సిన పదార్థాలు ఏంటి అనేవి ఈ స్టోరీలో తెలుసుకుందాం..




### కొబ్బరి రైస్ తయారీకి కావాల్సిన పదార్థాలు..

1. ముప్పావు కప్పు కొబ్బరి పాలు(సొంతగా చేసుకున్నవి అయినా లేదా వేరే దుకాణం నుంచి తీసుకొచ్చినదైనా పర్వాలేదు)
2. ఒక కప్పు బాస్మతి బియ్యం
3. ఒక టేబుల్ స్పూన్ నూనె
4. ఒక టేబుల్ స్పూన్ బటర్
5. సన్నగా తరిగిన ఉల్లిగడ్డ అరకప్పు
6. 2 లవంగాలు
7. ఇంచ్ దాల్చిన చెక్క
8. 2 ఇలాచీ
9. అరకప్పు సన్నగా తరిగిన క్యారెట్
10. పావుకప్పు పచ్చ బఠాణీలు
11. కొన్ని ఫ్రై చేసిన జీడిపప్పులు
12. రుచికి సరిపడా ఉప్పు
13. సన్నగా తరిగిన కొత్తిమీర

ముందుగా ఒక ప్రెషర్ కుక్కర్‌లో నూనె, బటర్‌ను వేసి కొంచెం సేపు వేడి చేసుకోవాలి. ఆ నూనె, బటర్ కొంచెం వేడెక్కాక.. అందులో ఉల్లిగడ్డ, లవంగాలు, దాల్చిన చెక్క, ఏలకులు వేసి ఒక నిమిషం పాటు బాగా ఫ్రై చేసుకోవాలి. అనంతరం ఫ్రై చేసిన జీడిపప్పు సగం, సన్నగా తరిగిన క్యారెట్ ముక్కలు, పచ్చ బఠాణలు వేసి ఇంకో నిమిషం పాటు బాగా ఫ్రై చేసుకోవాలి. అనంతరం అందులో 15 నిమిషాల పాటు నానబెట్టిన బాస్మతి రైస్, కొబ్బరి పాలు, మిగిలిన సగం జీడిపప్పు, రుచికి సరిపడా ఉప్పు, ఒక కప్పు రైస్‌కి ఒకటిన్నర కప్పు నీళ్లు పోసి.. బాగా కలుపుకోవాలి. అనంతరం సన్నటి మంట మీద రెండు విజిల్స్ వచ్చే వరకు కుక్ చేసుకోవాలి. అనంతరం రైస్‌లోని స్టీమ్ బయటికి వెళ్లేంత వరకు విజిల్ పైకి ఉంచి స్టీమ్ పోయేలా ఉంచాలి. అనంతరం మూత తీసి దానిపై కొత్తిమీర వేసి, బాగా కలుపుకోవాలి.


అనంతరం సన్నగా తరిగిన కొబ్బరితో వేసి గార్నిష్ చేసుకోవాలి. అనంతరం ఒక పళ్లెంలో ఆ రైస్‌ని సర్వ్ చేసుకుంటే సరిపోతుంది. ఘుమఘుమలాడే కొబ్బరి పాల అన్నం సిద్ధమైనట్లే.

## పొరపాటున కూడా భార్యతో ఈ విషయాలు చెప్పకండి?



భారతదేశంలో వైవాహిక జీవితాన్ని బండితో పోల్చారు. ఇందులో భార్యాభర్తలు బండి చక్రాలుగా ఉంటారు. ఒక చక్రం విరిగిపోయినా.. ఈ వైవాహిక జీవితం ముందుకు సాగదు. భార్యాభర్తల మధ్య బంధం ఎంత పటిష్టంగా ఉంటే అంత సున్నితంగా ఉండడానికి ఇదే కారణం. ఈ బంధాన్ని దృఢంగా ఉంచుకోవాలంటే, ఇద్దరి నుంచి చాలా శ్రమ, కృషి అవసరం. సహజీవనం చేస్తున్నప్పుడు భార్యాభర్తల మధ్య మనస్పర్థలు, గొడవలు రావడం సహజమే. అయితే కోపంలోనో, తమాషాగానో, ఈ దృఢమైన బంధాన్ని బలహీనపరిచే కొన్ని మాటలు నోటి నుంచి జారకూడదని గుర్తుంచుకోవాలి. ఇంటిని, బంధుత్వాలన్నింటినీ వదిలేసిన స్త్రీకి భర్తంటే గౌరవం. అలాంటి పరిస్థితుల్లో భర్త ఎప్పుడూ కోపంతోనో, సరదాగానో భార్య ఆత్మాభిమానాన్ని దెబ్బతీసే మాటలు మాట్లాడకూడదు. ఇది తరచుగా పెద్ద వివాదాలకు కారణం కావచ్చు. భర్త తన భార్యతో ఎప్పుడూ చెప్పకూడని 3 విషయాల గురించి తెలుసుకుందాం.. ఒక భర్త తన భార్య శరీర ఆకృతి గురించి ఎప్పుడూ తప్పుగా ప్రస్తావించకూడదు. ఎందుకంటే అది స్త్రీకి నచ్చదు. తన భర్తే తనను కామెంట్ చేస్తున్నాడని భావిస్తారు. భార్య లావుగా, సన్నగా ఉందని లేదా ఆమె ఎత్తు గురించి సరదాగా కూడా వ్యాఖ్యానించకండి. చాణక్యుడు నీతిశాస్త్రం ప్రకారం... పురుషులు తమ బలహీనతను భాగస్వామితో ఎప్పుడూ చెప్పకూడదంట. ఎందుకంటే ఆమె మీ బలహీనతనే మీకు వ్యతిరేకంగా ఆయుధంగా ఉపయోగించే అవకాశం ఉందంట. అందుకే పురుషులు ఈ పని అస్సలు చేయకూడదని చెపుతున్నారు. మీకు జరిగిన అవమానం గురించి మీ భార్యకు ఎప్పుడూ చెప్పకండి. ఎందుకంటే భవిష్యత్తులో ఆమె కూడా అదే ఆలోచనతో ఉండి మీకు జరిగిన అవమానాన్ని పునరావృతం చేస్తుంది. ఆమె మీ గురించి చెడుగా మాట్లాడే అవకాశం ఉంది. మీరు ఎంత సంపాదిస్తున్నారో, ఎంత చెల్లిస్తారో మీ భార్యకు తెలియకూడదంట. లేకపోతే అవి మీ ఖర్చులను నియంత్రిస్తాయి. దీంతో అవసరమైనంత ఖర్చు చేయడం కష్టమవుతుంది. మీరు చేసిన విరాళం ఎల్లప్పుడూ రహస్యంగా ఉండాలి. కుడి చేత్తో ఇస్తే ఎడమ చేతికి కూడా తెలియకూడదన్న సామిత ఉంది. అదే విధంగా మీరు చేసిన విరాళం గురించి మీ భార్యకు ఎప్పుడూ చెప్పకూడదు.

## టాకీస్



# ప్రభాస్ సినిమా.. హ్యారీపోటర్ రేంజ్ లో?

హాలీవుడ్ లో 'హ్యారీపోటర్' సిరీస్ అంటే ఇష్టపడని వారు ఉండరు. చిన్న పిల్లలకి ఇది బాగా ఇష్టమైన మూవీ ఫ్రాంచైజ్ అని చెప్పాలి. హాలీవుడ్ ఫోక్ టేల్స్ కథల ఆధారంగా ఈ 'హ్యారీపోటర్' సిరీస్ ని తెరకెక్కించారు. ఈ సిరీస్ లో ఇప్పటి వరకు 8 సినిమాలు వచ్చాయి. హాలీవుడ్ బడా నిర్మాణ సంస్థ వార్నర్ బ్రదర్స్ కి అత్యంత ప్రతిష్టాత్మక ఫ్రాంచైజ్ లలో ఇది ఒకటి. కంప్లీట్ ఫిక్షనల్ ప్రపంచంలో ఈ కథ నడుస్తూ ఉంటుంది.

ఇండియన్ సిల్వర్ స్క్రీన్ పై ఇప్పటి వరకు ఈ తరహా కథని ఎవరూ ప్రయత్నం చేయలేదు. వందల కోట్ల బడ్జెట్ తో ఇలాంటి కథలని తెరకెక్కించాల్సి ఉంటుంది. అందుకే ఇండియన్ ఫిల్మ్ ఇండస్ట్రీలో ఈ తరహా కథలు చెప్పే సాహసం చేయరు. అయితే ఇప్పుడు ఇండియన్ సినిమా స్టాండర్డ్స్ పెరిగాయి. వందల కోట్ల బడ్జెట్ తో సినిమాలు చేస్తున్నారు. ముఖ్యంగా డార్లింగ్ ప్రభాస్ మీద ఎంత బడ్జెట్ అయిన పెట్టడానికి నిర్మాతలు ముందుకొస్తున్నారు.

ఇందులో కొన్ని సన్నివేశాలు చూశానని, అవి 'హ్యారీపోటర్' తరహాలో ఉన్నాయని అన్నారు. కచ్చితంగా మూవీ ఆడియన్స్ ని కొత్త అనుభూతి అందించే అవకాశం ఉందని అన్నారు. అలాగే ప్రభాస్ తో 'స్పిరిట్' కాకుండా మరో సినిమా కూడా చేయబోతున్నట్లు భూషణ్ కుమార్ తెలిపారు. మైత్రీ మూవీ మేకర్స్ తో కలిసి ఆ సినిమా నిర్మించనున్నట్లు క్లారిటీ ఇచ్చారు. ప్రభాస్ తో మరల కలిసి పని చేయడం హ్యాపీగా ఉందని భూషణ్ కుమార్ అన్నారు.

# శ్రీవారిసేవలో మెగా 'మట్కా' టీం



మెగా హీరో వరుణ్ తేజ్, మీనాక్షి చౌదరి జంటగా కరుణ కుమార్ దర్శకత్వంలో రూపొందిన మట్కా సినిమా రేపు ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. భారీ అంచనాల నడుమ రూపొందిన ఈ సినిమా వరుణ్ తేజ్ కెరీర్‌లో బిగ్గెస్ట్ బడ్జెట్ మూవీగా నిలువబోతుంది. భారీ అంచనాలున్న ఈ సినిమా షూటింగ్ ప్రారంభం అయినప్పటి నుంచి ఎప్పుడు విడుదల అవుతుందా అంటూ మెగా ఫ్యాన్స్ ఆసక్తిగా ఎదురు చూస్తూ వచ్చారు. ట్రైలర్ విడుదల తర్వాత సినిమాపై అంచనాలు మరింతగా పెరిగాయి. వరుణ్ లుక్ కచ్చితంగా సినిమా హిట్ అవుతుంది అనే నమ్మకంను కలిగిస్తోంది అంటూ నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. సినిమా ప్రమోషన్‌లో భాగంగా గత రెండు వారాలుగా మీడియా లో మట్కా టీం సందడి చేస్తున్నారు. తెలుగు రాష్ట్రాల్లో పలు చోట్ల సినిమా ప్రమోషన్ నిర్వహించిన మట్కా టీం చివరగా విడుదలకు ముందు రోజు తిరుమల శ్రీవారి దర్శనంకు వెళ్లారు. అక్కడ స్వామి వారిని దర్శించుకుని వేద పండితుల ఆశీర్వాదం అందుకుని, ప్రసాదాలు స్వీకరించారు. వరుణ్ తేజ్ తో పాటు ఇతర యూనిట్ సభ్యులు తిరుమల శ్రీవారిని దర్శించుకున్న వారిలో ఉన్నారు. శ్రీవారి దర్శనం తర్వాత మాట్కా సినిమా గురించి చిత్ర యూనిట్ సభ్యులు మీడియాతో మాట్లాడుతూ తప్పకుండా ఇది ఒక మంచి సినిమా అవుతుందని, వసూళ్ల పరంగా వరుణ్ తేజ్ కెరీర్ లో బిగ్గెస్ట్ మూవీగా నిలుస్తుందని కూడా అభిప్రాయం వ్యక్తం చేశారు. మూడు విభిన్నమైన ఏజ్ గ్రూప్ లో వరుణ్ తేజ్‌ను దర్శకుడు కరుణ కుమార్ చూపించడం జరిగింది.





# కంగువా.. రిలీజ్ లో టెన్షన్ టెన్షన్!

కోలీవుడ్ నుంచి నవంబర్ 14న రాబోతున్న మోస్ట్ అవైటెడ్ మూవీ 'కంగువా'పై దేశ వ్యాప్తంగా బజ్ ఉంది. ముఖ్యంగా తమిళం, తెలుగు భాషలలో ఈ సినిమాపైనే ఎక్కువ క్రేజ్ ఉంది. దీనికి కారణం సూర్య మాస్ ఇమేజ్ అని చెప్పొచ్చు. అలాగే పీరియాడికల్ జోనర్ లో యాక్షన్ బ్యాక్ డ్రాప్ కథతో వస్తోన్న ఈ సినిమాని విజువల్ స్పెక్టక్యులర్ గా డైరెక్టర్ శివ సిల్వర్ స్క్రీన్ పై ఆవిష్కరించారు. ఇప్పటికే ప్రేక్షకుల ముందుకొచ్చిన ట్రైలర్ కి పాజిటివ్ రెస్పాన్స్ వచ్చింది. ఈ మూవీ ప్రమోషన్స్ కూడా చాలా అగ్రెసివ్ గా చేస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ ఈ చిత్రాన్ని తెలంగాణాలో రిలీజ్ చేస్తోంది. భారీ ధరకి ఈ మూవీ నైజాం రైట్స్ ని మైత్రీ వారు సొంతం చేసుకున్నారు. ఇదిలా ఉంటే ఇప్పుడు ఈ సినిమాకి తెలంగాణాలో థియేటర్స్ సమస్య వచ్చినట్లు తెలుస్తోంది. రిలీజ్ కి ఇంకా ఒక్క రోజు మాత్రమే ఉంది. అయితే మైత్రీ మూవీ మేకర్స్ వారు తీసుకున్న నిర్ణయం వలన మల్టీ ప్లెక్స్ లలో సినిమా విడుదల కాకపోవచ్చని అనుకుంటున్నారు. నిజానికి థియేటర్స్ లో సినిమాలని షేరింగ్ మీద డిస్ట్రిబ్యూటర్స్ రిలీజ్ చేస్తూ ఉంటారు. వచ్చిన కలెక్షన్స్ లో థియేటర్ ఓనర్స్ కి అలాగే డిస్ట్రిబ్యూటర్స్ కి పర్సెంటేజ్ షేరింగ్ ఉంటుంది.



# 'పుష్ప 2' శ్రీలీల కిస్సిక్ పూర్తి..!

ప్రస్తుతం ఇండియన్ సినీ ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్న సినిమాల జాబితాలో అల్లు అర్జున్ హీరోగా నటిస్తున్న పుష్ప 2 సినిమా ముందు వరుసలో ఉంటుంది అనడంలో సందేహం లేదు. పుష్ప పార్ట్ 1 బాక్సాఫీస్ వద్ద భారీ వసూళ్లు నమోదు చేసింది. ముఖ్యంగా బాలీవుడ్ ప్రేక్షకులు పుష్ప సినిమాకు వంద కోట్ల వసూళ్లు కట్టబెట్టారు. జీరో ప్రమోషన్స్ తో ఉత్తర భారతంలో వంద కోట్ల వసూళ్లు సాధించిన పుష్ప కి సీక్వెల్‌గా రాబోతున్న పుష్ప 2 సినిమా అక్కడ ఏ స్థాయిలో వసూళ్లు సాధిస్తాయో అంటూ అంతా ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఈ సినిమా ట్రైలర్‌ను నవంబర్ 17న విడుదల చేయడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. ట్రైలర్ విడుదలకు ముందే షూటింగ్ కి గుమ్మడి కాయ కొట్టేశారు. గత మూడు నాలుగు రోజులుగా షూట్ చేస్తున్న పుష్ప 2 ఐటెం సాంగ్ పూర్తి అయింది. అల్లు అర్జున్, శ్రీలీల నువ్వా నేనా అన్నట్లుగా డాన్స్ చేశారని యూనిట్ సభ్యులు చెబుతున్నారు. కిస్సిక్ అంటూ సాగే ఈ పాటతో పుష్ప 2 పై అంచనాలు మరింతగా పెరగడం ఖాయం. ట్రైలర్ విడుదల తర్వాత ప్రత్యేక రోజు ఏదైనా చూసి కిస్సిక్ ఐటెం సాంగ్‌ను ప్రేక్షకుల ముందుకు తీసుకు వచ్చే అవకాశాలు ఉన్నాయి. ఇప్పటికే ఉన్న అంచనాల కారణంగా రూ.1400 కోట్ల ప్రీ రిలీజ్ బిజినెస్ చేసిన పుష్ప 2 ట్రైలర్, ఐటెం సాంగ్ తర్వాత మరింతగా బజ్ పెరిగే అవకాశాలు ఉన్నాయి. ఓపెనింగ్ వసూళ్లు రూ.500 కోట్లు ఉండాలనే పట్టుదలతో మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. అందుకు తగ్గట్లుగానే దాదాపు అయిదు ఆరు కోట్ల రూపాయలు ఖర్చు చేసి ఐటెం సాంగ్‌ను తెరకెక్కించారని తెలుస్తోంది. ఐటెం సాంగ్‌లో నటించినందుకు గాను శ్రీలీలకు ఏకంగా రూ.2 కోట్ల పారితోషికంను మైత్రి మూవీ మేకర్స్ వారు ఇచ్చారని తెలుస్తోంది.

# కృతి సక్సెస్ పార్టీలో ముద్దుగుమ్మలు

'దో పత్తి' సినిమాలో కృతి సనన్ అక్క చెల్లి పాత్రల్లో నటించింది. డ్యూయెల్ రోల్‌లో నటించడంతో పాటు స్వయంగా ఈ సినిమాను నిర్మించడం జరిగింది. అక్టోబర్‌లో ఓటీటీ ద్వారా ప్రేక్షకుల ముందుకు వచ్చిన దో పత్తి సినిమాకు మంచి స్పందన దక్కింది. కృతి సనన్ నటనకు విమర్శకుల నుంచి ప్రశంసలు దక్కాయి. అంతే కాకుండా సినిమా ఒక మంచి మెసేజ్ తో కూడినదిగా అభినందనలు దక్కించుకుంది. అందుకే కృతి సక్సెస్ పార్టీని ఏర్పాటు చేయడం జరిగింది. బాలీవుడ్‌కి చెందిన ప్రముఖులు ఇలా సినిమాలు హిట్ అయినప్పుడు సక్సెస్ పార్టీలు చేసుకోవడం చాలా కామన్‌గా జరుగుతూ ఉంటుంది. కృతి ఇచ్చిన 'దో పత్తి' సక్సెస్ పార్టీలో బాలీవుడ్‌కు చెందిన స్టార్ సీనియర్ హీరోయిన్స్‌తో పాటు తెలుగు ప్రేక్షకులకు సుపరిచితం అయిన టాలీవుడ్ స్టార్ హీరోయిన్స్ రకుల్ ప్రీత్ సింగ్, తమన్నా, ప్రగ్యా జైస్వాల్ లు పాల్గొన్నారు.



Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.